పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

పెరిగిన నేరాలు

- కిడ్నాప్, దొంగతనాలు, దోపిడీ కేసుల పెరుగుదల
- మహిళలపై తగ్గిన నేరాలు
- 2025 నేర గణాంకాలను వెల్లడించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాదిలో నేరాలు పెరిగాయి. మొత్తం నేరాల్లో గతేడాది కంటే 0.7 శాతం పెరుగుదల నమోదైంది. కిడ్నాప్, దొంగతనాలు, దోపిడీ కేసుల్లో పెరుగుదల నమోదైంది. మహిళలపై నేరాలు తగ్గాయి. 2025 వార్షిక నేర గణాంకాలను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మంగళవారం మీడియాకు వెల్లడించారు..

కర్నూలు జిల్లా వ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో నేరాలు స్వల్పంగా పెరిగాయి. 2024లో జిల్లా వ్యాప్తంగా 4022 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 4051 కేసులు నమోదయ్యాయి. కిడ్నాప్, దొంగతనాలు, దోపిడీ కేసుల్లో పెరుగుదల నమోదైంది. గతేడాది జిల్లాలో 16 కిడ్నాప్ కేసులు నమోదుకాగా ఈ ఏడాది 17 కేసులు నమోదయ్యాయి. దోపిడీ కేసులు గతేడాది ఐదు కేసులు నమోదు కాగా ఈ ఏడాది 12 కేసులకు పెరిగాయి. గతేడాది 26 పగటి దొంతనాలు నమోదు కాగా ఈ ఏడాది 46 కేసులు నమోదయ్యాయి. రాత్రి దొంగతనాలు గతేడాది 117 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 119 కేసులకు పెరిగాయి. హత్యలు, హత్యాయత్నం కేసులు తగ్గాయి. గతేడాది 34 హత్య కేసులు నమోదు కాగా ఈ ఏడాది 29 హత్య కేసులు నమోదయ్యాయి. గతేడాది 41 హత్యాయత్నం కేసులు నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 29కు తగ్గింది. మరో వైపు మహిళలపై నేరాల్లోనూ తగ్గుదల నమోదైంది. అత్యాచార కేసులు గతేడాది 10 నమోదు కాగా ఈ ఏడాది 5 కేసులు నమోదయ్యాయి. గతేడాది 61 పోక్సో కేసులు నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 37కు తగ్గింది. వరకట్న మరణాల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. గతేడాదితో సమానంగా ఈ ఏడాది మూడు వరకట్న మరణాల కేసులు నమోదయ్యాయి. ఎస్‌సి, ఎస్‌టిలపై నేరాలు కూడా తగ్గాయి. గతేడాది 124 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 107 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాలు 40 శాతం తగ్గాయి. గతేడాది 107 సైబర్ నేరాల కేసులు నమోదు కాగా ఈ ఏడాది 64 కేసులు నమోదయ్యాయి.

అంకెల్లో నేర గణాంకాలు

పెరిగిన నేరాలు ఇలా..

నేరం	2024	2025
కిడ్నాప్	16	17
పగటి దొంగతనాలు	26	46
రాత్రి దొంగతనాలు	117	119
దోపిడీ	5	12

తగ్గిన నేరాలు ఇలా..

నేరం	2024	2025
సైబర్ నేరాలు	107	64
ఎస్‌సి, ఎస్‌టి	124	107
అత్యాచారాలు	10	05
పోక్సో	61	37
హత్యలు	34	29
హత్యాయత్నం	41	29

జరిమానాలు.. స్వాధీనాలు..

- ఈ ఏడాది 13 గంజాయి కేసులు నమోదయ్యాయి. 41 మందిని అరెస్టు చేశారు. 44.66 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- ఈ ఏడాది 89 మట్కా కేసుల్లో 146 మందిని అరెస్టు చేసి రూ.9.36 లక్షలు సీజ్ చేశారు.
- రెండు క్రికెట్ బెట్టింగ్ కేసులు నమోదు చేసి 10 మందిని అరెస్టు చేశారు. రూ.70వేలు సీజ్ చేశారు.
- మొబైల్ రికవరీ మేళాలో రూ.3.7 కోట్ల విలువైన 1,873 మొబైల్స్ రికవరీ చేశారు.
- ఈ ఏడాది 720 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి రూ.10.03 లక్షలు జరిమానా విధించారు.
- ఈ ఏడాది 71,705 మోటర్ వాహన చట్టం కేసులు నమోదు చేసి రూ.2.77 కోట్ల జరిమానా విధించారు.
- 11 మందిపై జిల్లా బహిష్కరణ ప్రతిపాదనలు పంపగా ఇప్పటి వరకూ ఐదుగురిని జిల్లా నుంచి బహిష్కరణ చేశారు.
- గతంలో సమస్యలు సృష్టించిన వారిని, పాత నేరస్తులను గుర్తించి 2,539 మందిని బైండోవర్ చేశారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. గతేడాది 547 రోడ్డు ప్రమాదాలు సంభవించగా ఈ ఏడాది 658 ప్రమాదాలు జరిగాయి. గతేడాది 270 ప్రాణాంతక ప్రమాదాలు జరగ్గా ఈ ఏడాది 278 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గతేడాది 277 ప్రాణాంతకం కాని ప్రమాదాలు చోటు చేసుకోగా ఈ ఏడాది వాటి సంఖ్య 380కు పెరిగింది.

భారీగా పెరిగిన 'మద్యం' కేసులు

జిల్లాలో గతేడాది 1613 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా ఈ ఏడాది 9,196 కేసులు నమోదు చేశారు. గతేడాది 4,338 బహిరంగంగా మద్యం సేవించే కేసులు నమోదు కాగా ఏడాది ఆ సంఖ్య ఏకంగా 17,392కు పెరిగింది.

ఈ ఏడాది పోలీసుల కార్యక్రమాలు..

నేను సైబర్ స్మార్ట్ పేరుతో 5,830 కార్యక్రమాలు నిర్వహించారు. పల్లె నిద్రలు, యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాలు నిర్వహించారు. సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలను గుర్తించి 5,994 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

జిల్లాలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి. నేరాలు అదుపు చేసేందుకు పోలీసులు గట్టిగా పని చేస్తున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు పోలీసులు సమాచారం అందించి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రజలు వినియోగించుకోవాలి. వాటి ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చు. హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి. జీరో డ్రంక్ అండ్ డ్రైవ్ సాధించేందుకు కృషి చేస్తున్నాము. శక్తి టీముల ద్వారా అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళలపై నేరాలు అరికట్టగలిగాం.

'పది' ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - హోళగుంద

పదో తరగతిలో ఉత్తీర్ణతే లక్ష్యంగా కష్టపడి చదవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కన్నడ)ను, హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఉందని, ఎక్కువ సమయం చదువుకు కేటాయించి, కష్టపడి బాగా చదువుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థికీ 85 శాతానికి పైగా మార్కులు వచ్చే విధంగా దృష్టి పెట్టాలని తెలిపారు. రోజూ నిర్వహించే యూనిట్ టెస్ట్ కోసం బాగా చదివితే, పబ్లిక్ పరీక్షలకు కచ్చితంగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ టెస్ట్‌లో 20 మార్కులకు 15 మార్కులు పైగా తెచ్చుకోవాలని సూచించారు. సబ్జెక్ట్ పరంగా ఏ విధంగా చదివితే మార్కులు బాగా వస్తాయనే దాని మీద కలెక్టర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠాలు ఏ విధంగా చెబుతున్నారు, భోజనం రుచిగా ఉంటుందా, భోజనం సరిపోయినంత పెడుతున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కన్నడ)ను తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రతను పరిశీలిస్తూ భోజనం బాగుందని, వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన పోషకాహారం అందించాలని ప్రధానోపాధ్యాయుని ఆదేశించారు. డిఇఒ జి.సుధాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ లోక రాజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, హోళగుంద ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ నిజాముద్దీన్ పాల్గొన్నారు. హోళగుందలో పౌర సరఫరాల శాఖకు సంబంధించి ప్రభుత్వ చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. రేషన్ సరుకులు, తూకాలను పరిశీలించారు. అనంతరం వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించడంలో భాగంగా మీనాక్షమ్మ, బసమ్మ అనే వృద్ధులకు రేషన్ సరుకులను అందజేశారు.

ఉన్నత విద్యను కాపాడుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు
- ఆర్‌యులో ఎస్‌ఎఫ్‌ఐ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్వీర్యం చేసేలా విధానాలను రూపొందిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు అన్నారు. ఉన్నత విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. మంగళవారం రాయల్ సీమ విశ్వవిద్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ 56వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎండి ఆనంద్‌బాబు ఎస్‌ఎఫ్‌ఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మతోన్మాదాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. విద్యా వ్యవస్థ సర్వనాశనం అవుతోందన్నారు. ప్రజాస్వామ్య రక్షణకు ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. రాయల సీమ యూనివర్సిటీ అభివృద్ధి, ప్రొఫెసర్ పోస్టులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని కోరారు. యూనివర్సిటీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ, యూనివర్సిటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నూతన కోర్సులకు అనుగుణంగా ఫ్యాకల్టీ నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. దశల వారీగా ఉద్యమాలు చేసి, విద్యార్థులను ఐక్యం చేస్తామని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు సందీప్ నాయక్, ఓబులేసు, సందీప్, అశోక్, సాయి, నవీన్, రంగ, వంశీ, కిరణ్, బాష, అభి, పృథ్వి, ప్రకాశ్, ప్రశాంత్, గణేష్, హర్షవర్ధన్, భరత్, వేణు, గోపాల్, ప్రదీప్, మనోహర్, సునీల్‌లు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2026 నూతన సంవత్సర డైరీ , క్యాలెండర్ ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ .సుధాకర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఆర్ఎ రవికుమార్, నవీన్ పాటి జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ జిల్లా కోశాధికారి యెహోషువ,జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, ఇబ్రహీం చంద్రకళ, లక్ష్మీకాంత్ నాయక్, సురేష్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బిడి సుధీర్ రాజు రాష్ట్ర కౌన్సిలర్ సర్వేశ్వర్ రెడ్డి ఇతర మండలాలు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ సుధాకర్ మాట్లాడుతూ విద్యారంగా అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

జాతీయ ర్యాంకింగ్‌లో నిలవాలి

- వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాతీయ స్థాయి ర్యాంకింగుల్లో విశ్వవిద్యాలయాన్ని నిలపాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి. వెంకట్ బసవరావు పిలుపునిచ్చారు. మంగళవారం రాయలసీమ విశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్ హాలులో పీజీ, ఇంజినీరింగ్ విభాగాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. విసి మాట్లాడుతూ ప్రతి విభాగానికి సెమినార్లు లేదా కాన్ఫరెన్సులు నిర్వహణకు కేటాయించిన రూ.50 వేల నిధులను సద్వినియోగం చేయాలని సూచించారు. సైన్స్ విభాగాలకు పరికరాలు, కెమికల్స్, స్టేషనరీ కొనుగోళ్లకు తగిన నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా కోర్సుల సిలబస్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ప్రణాళిక రూపొందించాలని ఆయన ఆదేశించారు. అధ్యాపకులు, విద్యార్థులు లైబ్రరీని సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ బి.విజయకుమార్ నాయుడు, కాలేజీ ప్రిన్సిపల్ సి. విశ్వనాథ్‌రెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ పివి. సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ సివి. కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్. భరత్ కుమార్‌తో పాటు వివిధ పీజీ, ఇంజినీరింగ్ విభాగాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీసీ వెంకట బసవరావు

ఆర్‌టిసి ఎండికి వినతిపత్రం ఇస్తున్న యువ స్పందన నాయకులు

పత్తికొండ నుండి విజయవాడకు బస్సు సర్వీసు

ఆర్‌టిసి ఎండి కి యువ స్పందన వినతి

ప్రజాశక్తి- పత్తికొండ

పత్తికొండ డిపో నుండి విజయవాడ , శ్రీశైలానికి కొత్త బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని పత్తికొండ యువస్పందన ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు కోరారు. బుధవారం పత్తికొండ బస్టాండ్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఎపిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు నూతన సర్వీసులు ఏర్పాటు చేయాలని యువ స్పందన సొసైటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పత్తికొండ డివిజన్ ప్రాంతం చుట్టుపక్కల నుండి విజయవాడకు , శ్రీశైలానికి చాలామంది ప్రజలు, విద్యార్థులు, కూలీలు వెళ్లి వస్తుంటారని తెలిపారు. కడప, బ్రహ్మంగారి మఠం ప్రాంతాలకు భక్తులు వెళ్లి వస్తున్నారని అన్నారు. పత్తికొండ డిపో నుండి సుదూర ప్రాంతాలకు బస్సులు లేనందువలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పత్తికొండ డిపో నుండి పాత బస్సులను నడపడం వల్ల డ్రైవర్, కండక్టర్‌తో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పత్తికొండ నుండి విజయవాడ, శ్రీశైలం , బ్రహ్మంగారిమఠం శ్రీశైలం ప్రాంతాలకు కొత్త సర్వీస్ ఏర్పాటు చేయాలని కోరారు. యువ స్పందన సొసైటీ సభ్యులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

2 నుంచి కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ

- తహశీల్దార్ గుండాల నాయక్

ప్రజాశక్తి-మద్దికేర

రీసర్వే జరిగిన గ్రామాలకు సంబంధించిన రైతులకు జనవరి 2 నుంచి 9 తేదీ వరకు నిర్వహించే గ్రామ సభల్లో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ గుండాల నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని హంప రెవెన్యూ గ్రామంలో రైతులకు జనవరి 2న పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. మిగతా ఆయా గ్రామాలలో నిర్దేశించిన రోజున రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తారని పేర్కొన్నారు. గతంలో పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలను వెనక్కు ఇచ్చి, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకోవాలని రైతులకు సూచించారు. పాస్ పుస్తకం రైతుకు అందునట్లుగా నిర్ధారించేందుకు బయోమెట్రిక్ తీసుకోనునట్లు తెలిపారు. గ్రామసభల నిర్వహణ సమాచారాన్ని, ముందుగానే రెవెన్యూ అధికారులు తెలుపుతారన్నారు. ఆరోజున వెళితే సరిపోతుందని ఆయన సూచించారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

సెంట్రింగ్ కార్మికుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ నరసింహులు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సెంట్రింగ్ కార్మికులను సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. నరసింహులు కోరారు. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సెంట్రింగ్ యూనియన్ కార్మికుల విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశం సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. సెంట్రింగ్ యూనియన్ నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. నరసింహులు, సిఐటియు జిల్లా నాయకులు టి.రాముడు మాట్లాడారు. జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించే బహిరంగ సభకు కార్మికులు భారీ ఎత్తు తరలిరావాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలకు చేస్తూ హక్కులను హరిస్తున్న దానికి వ్యతిరేకంగా కార్మికుల హక్కులు కాపాడుకోవడం కోసం తీర్మానాలుచేయబోతున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగాభవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలిపేసిందన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభిస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని మోసం చేసిందన్నారు. 12 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించి పథకాలు అమలు చేయాలని అడుగుతున్నా, పోరాటాలు చేస్తున్న పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ కూటమి ప్రభుత్వాన్ని కదిలించాలంటే కార్మిక వర్గం పెద్ద ఎత్తున సంఘటితమై పోరాటం చేయడం ద్వారానే సంక్షేమ బోర్డును సాధించుకోగలమని చెప్పారు. పోరాటాలకు పిలుపు ఇవ్వడం కోసమే విశాఖపట్నంలో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు జరుగుతున్నాయన్నారు. కార్మికుల హక్కుల జోలికొస్తే ఖబర్దార్ అంటూ విశాఖపట్నంలో కవాతుచేయబోతున్నారు. భవన నిర్మాణకార్మికుల గురించి పట్టించుకోవాలంటే ప్రభుత్వాన్ని అడుక్కోవడం కాదు పోరాటం ద్వారానే మన హక్కులను సాధించుకోవడానికి సిద్ధం కావాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు చలో విశాఖకు పెద్దసంఖ్యలో బయలుదేరి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ సహాయ కార్యదర్శి రమేష్, దస్తగిరి, లియాఖత్ అలీ ఖాన్ , అబ్దుల్లా ,సంజీవ్ మొదలగు వారు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.నరసింహులు, టి.రాముడు

జిజిహెచ్‌లో సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ

వైద్యులు,వైద్య సిబ్బంది గైర్హాజరు పై ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎమర్జెన్సీ విభాగాన్ని సోమవారం రాత్రి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ నిర్వహించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ విభాగంలో అక్కడ డ్యూటీలో ఉండాల్సిన డ్యూటీ అసిస్టెంట్ ఫిజీషియన్ (డిఎపి) అందుబాటులో లేకపోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అంతరాయం లేకుండా అందించాల్సిన సమయంలో, వైద్య సిబ్బంది గైర్హాజరు కావడం తీవ్ర నిర్లక్ష్యంగా అలాగే, ఎమర్జెన్సీ విభాగంలో అత్యవసర సేవలకు కీలకమైన ఇసిజి టెక్నీషియన్ అందుబాటులో లేదని తేలింది. హృదయ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఇసిజి నిర్వహించాల్సిన అవసరం ఉన్నందున, టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడం రోగుల ప్రాణాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వెంటనే సంబంధిత విభాగాలకు సూచనలు జారీ చేసి, ఎమర్జెన్సీ విభాగంలో సిబ్బంది హాజరును కచ్చితంగా పాటించే విధంగా చర్యలకు ఆదేశించారు. అత్యవసర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ అప్రమత్తంగా ఉండి పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని క్యాజువాల్టి మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. క్యాజువల్టీలో డిఎపి, డిఎఎస్ అసిస్టెంట్ లేకపోతే సమాచారం ఇవ్వాలని క్యాజువాలి మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

క్యాజువాలిటీలో వైద్యుల గైర్హాజరుపై ఆరాతీస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

స్వాధీనం చేసుకున్న గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

రూ.10.33 లక్షల గంజాయి దహనం

-అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎపి డిజిపి ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో మంగళవారం భారీగా గంజాయిని ధ్వంసం చేసి నిప్పు అంటించి తగలబెట్టారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా మాట్లాడుతూ.... కర్నూలు జిల్లా లోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధులలో 27 కేసులలో స్వాధీనం చేసుకున్న 126 కేజీ ల గంజాయిని కర్నూలు నగర సమీపంలోని దిన్నేదేవరపాడు దగ్గర ఉన్న జిల్లా పోలీసు ఫైరింగ్ రేంజ్ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు, రెవిన్యూ అధికారులు కలిసి ధ్వంసం చేశామన్నారు. పెండింగ్ ఉన్నటువంటి ఈ ప్రాపర్టీ మొత్తాన్ని కోర్టు మెజిస్ట్రేట్ అనుమతితో , ఎన్‌డిపిఎస్ ఆక్ట్ ప్రకారం ప్రొసిడింగ్స్ చేసి పంచనామా ప్రకారం గంజాయిని ధ్వంసం చేసి కాల్చి వేశారు. దహనం చేసిన గంజాయి విలువ రూ. 10 లక్షల 33 వేలు ఉంటుందన్నారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక దష్టి ఉంచామన్నారు. ఎక్సైజ్ అడిషనల్ ఎస్‌పి సుధీర్ బాబు , కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, ఎక్సైజ్ డిఎస్‌పి రామకృష్ణా రెడ్డి, నోడల్ ఆఫీసర్ సిఐ గుణశేఖర్ బాబు, సిఐలు తేజమూర్తి, విక్రమసింహా, శేషయ్య, నాగరాజారావు, ఇతర ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తగా అయ్యన్న

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ ఉత్తమ కార్యకర్తగా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన అయ్యన్న ఎంపికయ్యారు. మంగళవారం టిడిపి నంద్యాల పార్లమెంటు అధ్యక్షురాలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డిలు అయ్యన్నకు ఉత్తమ కార్యకర్త అవార్డును అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు విజయుడు, ఖాజామియా, బొజ్జప్ప, సర్కార్, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైల్వే నుంచి తొలగించి ఆన్‌లైన్‌లో చేర్చాలి

- రైతుసంఘం, వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పట్టా భూములను రైల్వే నుంచి తొలగించి ఆన్‌లైన్‌లో చేర్చాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న కోరారు. మంగళవారం తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని కుప్పగల్లు గ్రామంలో గత వందేళ్ల నుంచి వ్యవసాయం చేస్తూ, బ్యాంకుల నుంచి రుణాలు పొంది, రిజిస్ట్రేషన్లు జరుగుతున్న సొంత భూములను రీసర్వే సందర్భంగా రెవెన్యూ అధికారులు రైల్వే భూములుగా చూపారని తెలిపారు. రైతులకు బ్యాంకు రుణాలు గాని లేదా ఇతర సంక్షేమ పథకాలు కానీ రావడం లేదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే రైతుల పేర్లను అడంగల్‌లో చేర్చి పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. రైతులు నరసప్ప, సుభాన్, కుప్పయ్య, నారాయణస్వామి, కుమార్ స్వామి, భోజప్ప పాల్గొన్నారు.

'టిప్పర్' అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మిగనూరు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, టిప్పర్ యజమానులు ఐక్యంగా పనిచేస్తూ, రవాణా రంగ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపులో అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్లమెంట్ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ గోడపత్రికల ఆవిష్కరణ

శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా, కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ గోడపత్రికలను ఎమ్మెల్యే బీవీ ఆవిష్కరించారు. ఈ పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం పని తీరుపై కలెక్టర్ అసంతృప్తి

● విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు
● కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని మాచాపురం అంగన్వాడీ కేంద్రం పని తీరు పట్ల కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం మాచాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తూ కేంద్రంలో ఒకే ఒక్క చిన్నారి ఉండడంతో.. ఉదయం 9.30 గంటలు అవుతున్నప్పటికీ పిల్లలు ఎందుకు అంగన్వాడీ కేంద్రంలో లేరని కలెక్టర్ అంగన్వాడీ టీచర్‌ను ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న ఆ పాప ఎ, బి, సిలు కూడా చెప్పలేకపోవడంతో పిల్లలకు ఏం పాఠాలు నేర్పిస్తున్నారని అంగన్వాడీ టీచర్‌ను ప్రశ్నించారు. స్టాక్ రిజిస్టర్‌లు కూడా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పని తీరు మార్చుకోవాలని, విధులు సక్రమంగా నిర్వహించని అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బాత్‌రూములను యూనిసెఫ్‌తో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం అక్కడే ఉన్న గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, పింఛను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారా, పింఛను ఇచ్చే సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారా, పారిశుద్ధ్య సిబ్బంది రోజూ ఇంటి వద్దకొచ్చి చెత్త సేకరణ చేస్తున్నారా అని గ్రామస్తులను ఆరా తీశారు. పింఛను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారని, పింఛను ఇచ్చే సమయంలో డబ్బులు వసూలు చేయడం లేదని, పారిశుద్ధ్య సిబ్బంది రోజూ ఇంటి వద్దకొచ్చి చెత్త సేకరిస్తున్నారని, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. పీడీ విజయ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

మరో 1500 ఆర్‌టిసి బస్సులు

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమల రావు

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిసి బలోపేతం కోసం త్వరలోనే మరో 1500 ఆర్‌టిసి బస్సులు తెప్పిస్తున్నామని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళవారం ఆదోని ఆర్‌టిసి బస్టాండ్‌ను తనిఖీ చేశారు. స్త్రీ శక్తి పథకం అమలు గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో కలియ తిరిగి బస్టాండ్ ఆవరణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయిస్తామని తెలిపారు. బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం మెరుగు పరచాలన్నారు. గ్యారేజీలో తిరిగి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. కర్నూలుకు విద్యుత్ బస్సులు తెప్పిస్తున్నామని, ఆదోనికి కూడా మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వెయిటింగ్ హాలులో మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేయాలని డిఎం రఫీక్ అహ్మద్‌కు సూచించారు.

ఉత్తమ కండక్టర్‌గా అజీమ్ ఖాన్

విధుల్లో నైపుణ్యం ప్రదర్శించి సంస్థకు ఆదాయం సమకూర్చడంలో ప్రతిభ చాటి ఉత్తమ అవార్డు అందుకున్న ఆర్‌టిసి ఆదోని డిపో కండక్టర్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు అజీమ్ ఖాన్ సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. డిఎం రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి ఉద్యోగులకు ద్వారకా తిరుమల రావు ఉత్తమ అవార్డు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానం చేశారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో డ్రైవర్ రంగన్న, కండక్టర్ అజీమ్ ఖాన్, మరో మెకానిక్ ఉన్నారు. అజీమ్ ఖాన్ మాట్లాడుతూ... బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ అధికారుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. అజీమ్ ఖాన్‌కు కార్మిక సంఘాల నాయకులు లక్ష్మణ్, వీరన్న, తిప్పన్న, గోపాల్, రామాంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ప్రశంసా పత్రం అందుకుంటున్న అజీమ్ ఖాన్

రైతు సంక్షేమానికి 'కూటమి' కృషి

- ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి
- టిడిపి నూతన కార్యాలయ ప్రారంభోత్సవం
- 4 ఎన్‌టిఆర్ సుజల స్రవంతి యూనిట్లకు భూమిపూజ

ప్రజాశక్తి - నందవరం

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నందవరం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో రైతుల రుణ చెక్కుల పంపిణీ, టిడిపి నూతన కార్యాలయం ప్రారంభోత్సవం, టిడిపి జెండా ఆవిష్కరణ, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి తాగునీటి యూనిట్లకు భూమిపూజ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సహకార సంఘం ఛైర్మన్ ధర్మపురం గోపాల్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం 23 మంది రైతులకు రూ.1.13 కోట్లు మంజూరు చేశామన్నారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా చెక్కులను అందించారు. అనంతరం ఆయన గ్రామంలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి 4 యూనిట్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. శాశ్వత తాగునీటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రూ.లక్షల వ్యయంతో శుద్ధ జలాలను అందిస్తున్నామన్నారు. అనంతరం ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన జెండా కట్ట దగ్గరికి చేరుకుని జెండాను ఆవిష్కరించారు. అనంతరం నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఉత్తమ కార్యకర్తలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపిడిఒ పుల్లయ్య, డిప్యూటీ ఎంపిడిఒ సందీప్, పంచాయతీ రాజ్ ఎఇ నరసింహులు, జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పుష్పావతి, టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడు, మండల కార్యదర్శి లక్షప్ప, పూలచింత బండేగురుస్వామి, నాగలదిన్నె గ్రామ అధ్యక్షులు ఈరన్న, జబ్బార్, శేషాద్రి తిమ్మప్ప, ఉరుకుందు, భార్గవ్ యాదవ్, ఉదయ్ గౌడ్, సత్యరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, డబ్బా ఈరన్న, ఆదిశేషు, టిడిపి గ్రామ అధ్యక్షులు భీమశేఖర్, వడ్డే గోపాల్, వీరేష్ పాల్గొన్నారు.

రైతులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఉత్తమ కార్యకర్తల సర్టిఫికెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే

రీ సర్వేతో పొలం సమస్యలకు పరిష్కారం

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు తరతరాలుగా వస్తున్న భూ సమస్యలను పరిష్కరించడానికి రీసర్వే ఎంతో ఉపయోగపడుతుందని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం రీసర్వే ప్రాజెక్టు కింద ఎంపికైన రామదుర్గం, బెల్డోన గ్రామాల్లో రీ సర్వే గ్రామసభలను సర్పంచులు రోహిణి, కరివేముల సావిత్రి, రెవెన్యూ కార్యదర్శులు మల్లికార్జున, చంద్ర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. రైతులకు వారి వారసత్వానికి పొలం సమస్యలు ఎదురవకుండా ఉండడానికి ప్రభుత్వం రీ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే వల్ల భూమి కొలతలు పారదర్శకంగా చూసుకోవచ్చన్నారు. పొలం సమస్యలు ఏం వచ్చినా వాటిని పరిష్కరించడానికి అధికారులతో రైతులు మాట్లాడవచ్చన్నారు. ఆర్ఐ సునీత, టిడిపి నాయకులు సోమశేఖర్ నాయుడు, భీమప్ప, గోవిందు, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

అమరుల త్యాగస్ఫూర్తితో ఉద్యమం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు

విద్యారంగ సమస్యలపై పోరాడి అమరులైన వారి త్యాగాల స్ఫూర్తితో విద్య, ఉపాధి కోసం ఉద్యమించాల ని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.ఖాసీం, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెంజుండప్ప తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆలూరులోని గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో ఎస్ఎఫ్ఐ జెండాను ఖాసీం ఎగురవేశారు. మండల కార్యదర్శి ఉమేష్ అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా, జిల్లా మాజీ సహాయ కార్యదర్శి గోవర్ధన్, మండల నాయకులు బసవరాజ్, హనుమంతు, ఖాజా, యశ్వంత్, ఉదయ్, మణి, డాకే నాయక్ పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి భీమేశ్వరి

ప్రజాశక్తి - మంత్రాలయం

సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి భీమేశ్వరి కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహా సభకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే మహా సభలకు ప్రతి ఒక్కరు తరలి రావాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు జయరాజు, ప్రాణేష్, విశాలాక్షి, అంగన్వాడీ టీచర్లు లావణ్య దేవి, కల్యాణి, స్వప్న, జానకమ్మ పాల్గొన్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

ఆర్‌టిసి బస్టాండ్‌ను సౌకర్యాలతో అభివృద్ధి చేస్తాం

- ఆర్‌టిసి ఎమ్‌డి, వైస్ ఛైర్మన్ ద్వారకా తిరుమల రావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని ఆర్‌టిసి ఎమ్‌డి, వైస్ ఛైర్మన్ సి హెచ్.ద్వారకా తిరుమల రావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రాలయం వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్టాండ్‌ను మార్చుతామని చెప్పారు. బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, వెయిటింగ్ హాలుతో పాటు కుర్చీలు ఏర్పాటు చేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు అధికారులతో మాట్లాడి సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రధాన రహదారికి బస్టాండ్ లోతట్టు ప్రాంతంలో ఉండడంతో డ్రైనేజీ నీరు పారుదల లేదని, వర్షాకాలం నీరు నిలిచి పోతుందన్న ఫిర్యాదుపై ప్లాట్ ఫారం ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటుతో ప్రభుత్వానికి ఆదరణ లభిస్తోందన్నారు. బస్టాండ్ స్థలం కబ్జాకు గురయిందని, ప్రయివేట్ వాహనాలను నిలిపినా ప్రశ్నించే వారు లేరని తెలపడంతో బస్టాండ్ తరఫున వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేసి ఆదాయం పెంచే దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. బస్టాండ్ రూపురేఖలను మార్చేందుకు ప్రణాళికను ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. సిఐ రామాంజులు, ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో భద్రత కల్పించారు. ఇడిఒ అప్పలరాజు, కడప జోన్ ఇడి పైడి చంద్రశేఖర్, డిపిటిఒ శ్రీనివాసులు, డిప్యూటీ సిఎంఇ హరినాథ్ బాబు, డిఎం మద్దిలేటి నాయుడు, టిడిపి యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్‌డిని కలిసిన ప్రముఖులు

ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమల రావును టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జీ, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న కలిశారు. శ్రీపద్మనాభ తీర్థ అతిథిది గృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఆర్‌టిసి బస్టాండ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టి ఆధునికీకరణతో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. టిడిపి యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, జనసేన నాయకులు రవిచంద్ర ఉన్నారు.

బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ద్వారకా తిరుమల రావు

కోరం కోసం ఎదురుచూపులు

- ఎట్టకేలకు ముగిసిన సర్వసభ్య సమావేశం
- రైతులు డ్రిప్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపిడిఒ మణిమంజరి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి ఎదురుచూసినప్పటికీ సమావేశానికి అవసరమైన సంఖ్యలో ఎంపిటిసిలు హాజరు కాలేదు. సరయిన కోరం లేక వారి రాక కోసం మండల అధికారులు ఎదురు చూశారు. సమావేశం నిర్వహించాలా, వాయిదా వేయాలా అన్న సందిగ్ధంలో పడ్డారు. ఎంపిపి నసురుద్దీన్, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డితో పాటు ఏడుగురు ఎంపిటిసిలను కలుపుకొని మొత్తం 9 మంది హాజరు కావడంతో కోరం ఏర్పడింది. 12 గంటల సమయంలో సమావేశం ప్రారంభించారు. ఎఒ హేమలత మాట్లాడుతూ... మండలంలో బోరు బావులున్న రైతులందరూ తప్పనిసరిగా డ్రిప్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద ఎస్సీ, ఎస్టీలు వంద శాతం రాయితీ, బీసీలకు 90 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. రైతులందరూ పంటల మార్పిడి విధానాన్ని పాటించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలని, హార్టికల్చర్ కింద ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్ తోటలను సాగు చేసుకోవాలని సూచించారు. బి.అగ్రహారం సర్పంచి రంగారెడ్డి మాట్లాడుతూ... మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. ఉల్లి సాగు చేసి నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేల ఆర్థిక సహాయం గురించి అడిగారు. ఎఒ మాట్లాడుతూ... మండలంలో ఇప్పటికే 1080 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, ఇప్పుడున్న అవసరాలకు మరో 250 మెట్రిక్ టన్నులను రైతు సేవా కేంద్రాల ద్వారా సిద్ధం చేసి ఉంచామని వివరించారు. ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం హార్టికల్చర్ శాఖ ద్వారా వారి ఖాతాల్లో జమ అవుతుందని అన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ఎఇ అలీ మాట్లాడుతూ... జిడిపి కింద 12,500 ఎకరాల్లో మొక్కజొన్న, మినుములు, కంది పంటలు సాగు చేశారని తెలిపారు. ఈ పంటలన్నింటికీ మార్చి 31 వరకు నీరందించనున్నట్లు చెప్పారు.

ఎల్ఎల్‌సి ఆయకట్టుకు జిడిపి నీరివ్వాలి

- వైస్ ఎంపిపి వెంకట్రామిరెడ్డి

ఎల్ఎల్‌సి ఆయకట్టుకు జనవరి 10వ తేదీతో నీరు ఆగిపోతున్నందున ఎంఎల్ఎస్‌పి ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని అందజేసి కులుమాల, పెద్దనేలటూరు, అల్వాల గ్రామ పరిధిలో రైతులను ఆదుకోవాలని వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి జిడిపి అధికారులను కోరారు. ఫలితంగా ఆయా గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న, మిరప, కంది, శనగ పంటలను కాపాడినట్లు అవుతుందని తెలిపారు. హెచ్.కైరవాడి పశు వైద్యులు డాక్టర్ నిర్మల మాట్లాడుతూ... 50 గొర్రెలు లేదా 100 కోళ్లకు గాను ఒక యూనిట్ మినీ గోకులం షెడ్డు మంజూరు చేస్తామని, ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యుత్ ఎఇ సుధాకర్ రావు, ఉపాధి ఏపీవో మహ్మద్ బాష, ఎంఇఒ రామాంజనేయులు, ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వినిపించారు. డిప్యూటీ ఎంపిడిఒ శశికళ, ఎఒ శ్రీనాథ్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్యామల పాల్గొన్నారు.

ఎఒతో మాట్లాడుతున్న అగ్రహారం సర్పంచి రంగారెడ్డి

ప్రశంసాపత్రాలు అందిస్తున్న గుడిసె కృష్ణమ్మ, ఉమాపతి నాయుడు

సిఎం చంద్రబాబుకు తోడుగా నిలుద్దాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనించేలా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తోడుగా నిలుద్దామని టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. మంగళవారం ఉమాపతి నాయుడు కార్యాలయంలో టిడిపి కార్యవర్గానికి బెస్ట్ అవార్డు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దివాలా తీయించారని విమర్శించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పెట్టుబడులను ఆకర్షిస్తూ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందిస్తూ పరిశ్రమల స్థాపనకు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. 'సుపరిపాలనకు తొలి అడుగు'లో ప్రభుత్వ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విశేష సేవలందించిన కార్యకర్తలను గుర్తిస్తూ అధిష్టానం ఈ అవార్డులకు ఎంపిక చేసిందని తెలిపారు. నియోజకవర్గంలో 47 మంది కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశామన్నారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, ట్రెజరర్ రవి, నాయకులు రంగస్వామి నాయుడు, లక్ష్మీనారాయణ, జయరామ్, అంజనమ్మ, శ్రీనివాస్ ఆచారి, బాలాజీ, సుబ్బు, రంగన్న, రామస్వామి, జిందే శంకర్, వెంకటేష్, చాంద్ బాషా, పాడేగల్ అయ్యన్న ఉన్నారు.

పట్టపగలు చోరీ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సజ్జలగూడెం గ్రామంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితులు, గ్రామస్తులు, స్థానికుల వివరాల మేరకు... గుడ్డెప్ప గారి గర్జప్ప కుటుంబ సభ్యులు ఎప్పటిలాగానే పొలం పనులకు వెళ్లారు. తల్లి సిద్ధమ్మకు అస్వస్థతకు గురి కావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపి డాక్టర్ వద్దకు చికిత్స కోసం వెళ్లి వచ్చేలోపే బీరువాను పగులగొట్టి చెల్లాచెదురుగా బట్టలను పడేశారు. దొంగతనం జరిగినట్లు గుర్తించి.. చుట్టుపక్కల వారికి, గ్రామస్తులకు, బంధువులకు సమాచారం ఇచ్చారు. బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదును దొంగలు అపహరించినట్లు పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని బంగారం, వెండి, నగదు ఎంత పోయిందో పూర్తిస్థాయి విచారణ చేసి రికవరీ చేస్తామని పోలీసులు తెలిపారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - నందవరం

ప్రజలు నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు వారి ఇళ్లలో ఉత్సవాలు జరుపుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎస్పీ ఉత్తర్వుల మేరకు పటిష్టమైన బందోబస్తు, నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలను ఇబ్బందులకు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులు సుఖసంతోషాలతో జీవించాలి

- వైకుంఠం శివ ప్రసాద్

ప్రజాశక్తి - ఆస్పరి

కొత్త సంవత్సరం పాడి పంటలు, రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్ ఆకాంక్షించారు. మంగళవారం టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి స్వగ్రామంలో వైకుంఠం శివప్రసాద్ చేతులమీదుగా నూతన సంవత్సరం సందర్భంగా శ్రీపద్మావతి ఎంటర్‌ప్రైజెస్, బోర్ వెల్స్, శ్రీమారెమ్మ అవ్వ కూరగాయల టమోటా మార్కెట్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. టిడిపి సీనియర్ నాయకులు రామలింగప్ప, యువ నాయకులు రంగనాథ్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి వీరేష్, తెలుగు యువత నాయకులు ఉరుకుందు, సతీష్, రవి, మనోజ్ పాల్గొన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వైకుంఠం శివప్రసాద్

పెద్దహరివాణానికి వ్యతిరేకం కాదు

- టిడిపి నాయకులు వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పెద్దహరివాణం మండలానికి తాము వ్యతిరేకం కాదని టిడిపి నాయకులు చిన్నగోనెహాలు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. టిడిపి నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి, జడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ తిక్కన్న, మాజీ ఎంపిపి పంపాపతి, మాజీ కౌన్సిలర్ రామచంద్రతో కలిసి వారి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మదిరే సర్పంచి నారాయణ వారిని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెద్దహరివాణం మండలం కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు ఉద్యమించడంలో తమకు అభ్యంతరం లేదన్నారు. అనుకూలంగా లేని గ్రామాలను విలీనం చేయడం వల్ల.. రాకపోకలకు అనుకూలంగా లేదని తాము నిరాహార దీక్ష చేశామన్నారు. పరిపాలన సౌలభ్యం మెరుగుపడాలని 16 గ్రామాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. తమ ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి ఎవరికీ ఇబ్బంది లేకుండా ఆదోని-1, ఆదోని-2 మండలాలుగా ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నామని చెప్పారు. గతంలో ఆలూరు నియోజకవర్గంలో ధణాపురం, నారాయణపురం, చాగి, చిన్నహరివాణం, చిన్నగోనెహాలు, నాగనాథనహళ్లి ఉండగా ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. 2009 పునర్విభజనలో భాగంగా ఒకే నియోజకవర్గం ఒకే మండలంగా విలీనం చేసినట్లు తెలిపారు. ఆదోని మండలంలోనే తమ గ్రామాలు ఉండాలని, అప్పుడే అభివృద్ధి చెందుతామని గ్రహించి ఉద్యమం చేపట్టామని చెప్పారు. రెండు మండలాలుగా ఏర్పడడం.. ఆదోని కేంద్రంగా ప్రభుత్వ కార్యాలయాలు ఉండడం వల్ల తమకు అనుకూలమన్నారు. ఉద్యమానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. నాయకులు రాజు, షెక్షావలీ, కారమంచప్ప, సర్పంచులు చంద్రశేఖర్, నారాయణ, సోమశేఖర్ రెడ్డి, రాముడు ఉన్నారు.

మాట్లాడుతున్న వేణుగోపాల్ రెడ్డి

INSOLVENCY NOTICE UNDER SECTION 19(1) OF THE PROVINCIAL INSOLVENCY ACT.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : కర్నూలు.

I.P. NO. 12 of 2025

కోర్టు వారి ఉత్తర్వు/సూచనల మేరకు

C. సుధా రాణి ... పిటీషనర్

Vs.

షైక్ మహమ్మద్ రఫిక్ మరియు ఇతరులు ...రెస్పాన్డేంట్స్

Notice to the Respondent No.1 :

షైక్ మహమ్మద్ రఫిక్, తండ్రి: లేట్ శ్రీ D. బషు మియా, ఇంటి నెం.40/37-L-3-4, బళ్ళారి రోడ్, కర్నూలు – 518003.

Provincial Insolvency Act లోని సెక్షన్ 19(2) కింద ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడుతున్నది. పిటిషనర్ రెస్పాన్డెంట్ నం.1 ను దివాలా తీసిన వ్యక్తిగా (ఇంసాల్వెంటుగా) తీర్పు ఇవ్వాలని ఈ కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారని మరియు ఆ పిటిషను 29.01.2026న విచారణకు పోస్ట్ చేయబడినది అని తెలియజేయడమైనది.

కర్నూలు.

వాయిదా తేది : 29-01-2026

C.C.V. రంగారెడ్డి,
జి. మణి కుమార్,
న్యాయవాదులు,
డోర్ నెం. 62/71, ఫోర్ట్, కర్నూలు 518001.
సెల్ : 9441032210, 7075775222:

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KURNOOL

I.P. NO. 24 /2024

Chakali Bala Swamy ... Petitioner

-Vs-

K. Madhukar and others ... Respondents

NOTICE TO RESPONDENTS NO. 2,6,7,13

R2. B.Naraimhulu S/o B.Sanjanna R/o H.No. 87-1124, Kalyani Nagar, B.Camp Post, Kurnool.
R6. Kummari Suresh S/o Kummari Veeranna, R/o H.No. 87/1301-A, Somisetty Nagar, Kurnool.
R7. Chakali Maddilety S/o Chakali Pakkiraiah R/o H.No. 50-348-E20, Arora Nagar, B.Camp Post, Kurnool.
R13. C.Sreenivasulu S/o C.Pullaiah R/o H.No. 87/540, A-Camp, Kurnool.

పై తెల్పిన అర్జీదారుడు తనను దివాలాదారునిగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసియున్నాడు. ఇందులో 2,6,7,13 రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు నుండి పలుమార్లు నోటీసులు పంపినను మీకు చేరనందున పై కోర్టు వారు ఈ పత్రిక ద్వారా మీకు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 2,6,7,13 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైనా ఆక్షపణ ఉన్న యెడల తేది 7-1-2026 ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 7-1-2026

H.K.Jalandhar Rao,
G.Gopala Krishnaiah,
Advocates for Petitioner
Kurnool.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు కోరారు. మంగళవారం ఆలూరు ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ సిరికి వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్‌ఐ ప్రాంతీయ కార్యదర్శి మైనా, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఉమేష్ మాట్లాడారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించి, రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలగా మార్పు చేయాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు నిధులు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని, విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన తాత్కాలిక ఐటిఐ పురాతన భవనం పై కప్పునకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఆలూరులో బీసీ సంక్షేమ (ప్రీ మెట్రిక్) బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డివైఎఫ్‌ఐ నాయకులు శ్రీనివాసులు, అనిఫ్, ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు బసవరాజ్, శ్రీరామ్, చంద్ర, మణి, భాషా, మంజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీతో దీక్ష విరమణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే హామీతో లెదర్ సొసైటీ షేర్ హోల్డర్లు దీక్షలను విరమించారు. తమకు న్యాయం చేయాలని, ఎమ్మిగనూరు లెదర్ సొసైటీ ఆస్తులను కాపాడాలని, చనిపోయిన షేర్ హోల్డర్ల షేర్లను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని, అసలైన షేర్ హోల్డర్లను మోసం చేసి ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పారని, వారి నుంచి తిరిగి షేర్లను తమకు అప్పజెప్పాలని పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఎమ్మిగనూరు లెదర్ సొసైటీ షేర్ హోల్డర్లు గత 28 రోజుల నుంచి సర్కిల్‌లో నిరాహార దీక్షలు చేపడుతున్నారు. మంగళవారం ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 3 బీవీ.మోహన్ రెడ్డి ఆశయాల మేరకు ఎమ్మిగనూరు లెదర్ సొసైటీకి పూర్వ వైభవం తెస్తానని, షేర్ హోల్డర్లు దీక్షలు విరమించాలని కోరారు. మల్లెల గ్రూప్స్ అధినేత, వికలాంగుల రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఆల్‌ఫ్రెడ్ రాజు నిమ్మరసమిచ్చి దీక్షను విరమింపజేశారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, న్యూ లైఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సామ్యేల్, బీసీఆర్‌ఎఫ్ నాయకులు అజిత్ పాల్గొన్నారు.

దీక్షలను విరమింపజేస్తున్న ఆల్‌ఫ్రెడ్ రాజు

హామీ ఇచ్చే వరకు ఉద్యమం

- జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లాపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని జెఎసి నాయకులు హెచ్చరించారు. ఆదోని జిల్లా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలుస్తామని తెలిపారు. మంగళవారం భీమాస్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదోని జిల్లా సాధన జెఎసి నాయకులు రఘురామయ్య, వి.వీరేష్, కోదండ, కృష్ణమూర్తి గౌడ్, కుంకనూరు వీరేష్, నుజ్జూనమ్మ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ కలిసి ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి ప్రజల సెంటిమెంట్ గురించి వివరించినట్లు తెలిపారు. ఉద్యమం న్యాయమైందని చెప్పారు. మంత్రుల ఉప సంఘం సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినా.. స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారని తెలిపారు. స్పష్టమైన హామీ ఇవ్వలేకపోవడంతో తాము ముఖ్యమంత్రిని కలిసి ఆకాంక్షను తెలియజేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదోని జిల్లా చేస్తామని స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు ఐదు నియోజకవర్గాల్లో కొనసాగుతున్న దీక్షలు, ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న జెఎసి నాయకులు

ఘనంగా 'దీక్ష' ఫెస్ట్ డే వేడుకలు

- విద్య అనేది సమాజ సేవ - సిఇఒ తిరుమల రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో దీక్ష జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన ఫెస్ట్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముందుగా దీక్ష జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు కీర్తిశేషులు బూదూరు వీరారెడ్డి చిత్రపటానికి కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి, ప్రిన్సిపల్ మద్దిలేటితో పాటు కళాశాల అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుమలరెడ్డి, సుజనా రెడ్డి మాట్లాడారు. విద్య అనేది సామజిక సేవే గాని వ్యాపారం కాదని స్పష్టం చేశారు. విద్యాభ్యాస దశలో ఇంటర్మీడియట్ విద్య ముఖ్యమైందని తెలిపారు. ఈ దశలో ఎటువంటి వ్యసనాలకు లోను కాకూడదని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తక్కువ ఫీజుతో ఇంటర్మీడియట్ సాధారణ విద్యతో పాటు జెఇఇ మెయిన్స్, నీట్‌లాంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు శారీరక, మానసిక ఉల్లాసం కోసం క్రీడలకు కూడా ప్రాధాన్యతిస్తున్నామని చెప్పారు. దీక్ష అంటేనే ర్యాంకులు.. ర్యాంకులంటేనే దీక్ష అనే విధంగా పట్టణంలో నిరూపించిందని, ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పరీక్షలపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఫెస్ట్ డే వేడుకల సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యా బోధన ద్వారా ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న కళాశాల అధ్యాపకులకు చిరు సన్మానం చేశారు. ఈ ఫెస్ట్ డే వేడుకలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నాటికలు, నృత్యాలు, దేశభక్తి గీతాలు, మిమిక్రీ లాంటివి ప్రదర్శించి ఆనందోత్సాహంతో మునిగితేలారు. కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి, సీనియర్ అధ్యాపకులు రాజ్ కుమార్, ఎం.సురేష్, గౌస్, వి.శివకుమార్, సి.సురేష్, అంజిరెడ్డి, విరుపాక్షి, లింగమయ్య, రాముడు, నరసింహులు, పాల్ రాజ్, గోపాలకృష్ణ, నూరుల్లా, వీరేష్, లలిత, రాజేశ్వరి, రమాదేవి, పవిత్ర, జ్యోత్న్న, ప్రీతి, లక్ష్మి, ధనుంజయ, గోవిందు, అధ్యాపకేతర సిబ్బంది రఘు రెడ్డి, శిల్ప, నౌషద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దీక్ష కళాశాల సిఇఒ తిరుమల రెడ్డి

ప్రారంభిస్తున్న పీఠాధిపతులు

వైకుంఠ ద్వారం ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ద్వారాన్ని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ప్రారంభించారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి తిథి సందర్భంగా స్థానిక పాత ఊరులో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని వివిధ రంగురంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించిన పీఠాధిపతులు శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన శ్రీనివాసుని దర్శించుకుని తులసి అర్చన, పుష్పార్చన నిర్వహించి, శ్రీవెంకటేశ్వర స్వామికి మంగళహారతి ఇచ్చారు. ఆర్‌టిసి ఎమ్‌డి, వైస్ ఛైర్మన్ సిహెచ్.ద్వారకా తిరుమల రావు, ఇడిఒ అప్పలరాజు, కడప జోన్ ఇడి అధికారి పైడి చంద్రశేఖర్, డిపిటిఒ శ్రీనివాసులు, డిప్యూటీ సిఎంఇ హరి నాథ్ బాబు, డిఎం మద్దిలేటి నాయుడు, శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి పాల్గొన్నారు.

వెంకటేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైకుంఠ ఏకాదశి తిథి సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దంపతులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మంగళవారం స్థానిక పాతవూరులో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుని కాచాపురం సర్పంచి, ఎమ్మెల్యే సతీమణి జయమ్మ, మనుమళ్లతో కలిసి దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారి దర్శనార్థమై ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా శ్రీవారి సన్నిధిలో ప్రత్యేకంగా పుష్పాలతో ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారం ద్వారా ప్రవేశించి ప్రదక్షిణలు చేశారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, చెట్నిహళ్లి గ్రామ నాయకులు గంగుల వెంకటేష్, దేవేంద్ర, రచ్చుమర్రి గ్రామ నాయకులు బొజ్జప్ప, రవీంద్ర, మల్లికార్జున గౌడ్ ఉన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీవీ, ఆల్ఫ్రెడ్ రాజు

విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, లూయి బ్రెయిలీ లిపికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను, డైరీలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి, మల్లెల గ్రూప్స్ అధినేత, వికలాంగుల రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు ఆవిష్కరించారు.పట్టణంలోని విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరేష్, గిరిబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సింగనేటి నరసన్న, న్యూ లైఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సామ్యేల్, సతీష్ పాల్గొన్నారు.

దూషించడం సరైన పద్ధతి కాదు

- టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ తనను దూషించడం సరైన పద్ధతి కాదని టిడిపి మాచాపురం నాయకులు సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి నందవరం గ్రామంలో పర్యటించారని, ఆయన ఎస్సీ కాలనీలో పర్యటించిన సమయంలో తాము అభిమానంతో సన్మానించాలని వెళ్లామని తెలిపారు. ఎమ్మెల్యేకు పూలమాల వేసే సమయంలో ఖాసీం వలీ అడ్డగించి దూషించారని చెప్పారు. 'నువ్వు ఎమ్మెల్యేను సన్మానించరాద'ని నెట్టేశారన్నారు. గతంలో తాను వైసిపిలో ఉన్నానని, ఖాసీంవలీ ఆహ్వానం మేరకే టిడిపిలో చేరినట్లు తెలిపారు. పార్టీలోకి పిలిచి ఇలా అవమానించడం బాధిస్తోందని చెప్పారు. గ్రామంలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తున్న సమయంలో తతను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సమక్షంలో తనను అవమానించారని, తన మనోభావాలు దెబ్బ తిన్నాయని ఆవేదన చెందారు. ఇలాంటి ఘటనను ఎమ్మెల్యే ఖండించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పార్టీని దెబ్బతీస్తాయన్నారు. ఎమ్మెల్యే ఆదేశిస్తే రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. దేవసహాయం, వసంత్, యాకోబు, అశోక్, సునీల్, తిక్కయ్య, భాస్కర్, రంగన్న పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి

పీజీ 3 సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ విశ్వవిద్యాలయం పీజీ 3 సెమిస్టర్ ఫలితాలు రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ , డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి మంగళవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు నవంబర్ లో నిర్వహించామని, ఎంఎ, ఎం కామ్, ఎమ్మెస్సీ విద్యార్థులు మూడవ సెమిస్టర్ పరీక్షలు రాయగా మొత్తం 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి తెలిపారు. ఈ సమావేశంలో డీన్ డాక్టర్ మహమ్మద్ వాహిజ్, ఆర్థిక శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎల్లాకృష్ణ, వాణిజ్య విభాగం అధ్యాపకులు డాక్టర్ ధలవాయి శ్రీనివాసులు పాల్గొన్నారు

న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-సి బెళగల్

నేడు రాత్రి 31న న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సి బెళగల్ ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ప్రజలకు, యువతకు సూచించారు. మంగళవారం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. మద్యం అతిగా సేవించి రోడ్లలో ర్యాస్ డ్రైవింగ్ నడిపినా, సైలెన్సర్లు తీసి అతి శబ్దాలు చేసినా,సెలెబ్రేషన్ తో రోడ్లు బ్లాక్ చేసినా చర్యలు తప్పవన్నారు. అలాగే డిజె లు పెట్టరాదని, ట్రిపుల్ రైడింగ్ వంటివి తగదని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు యువతకు తగు జాగ్రత్తలు చెప్పుకోవాలని ఈ సందర్భంగా ఎస్ఐ పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికలు పై సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యువజన కాంగ్రెస్ విభాగం ఎన్నికల నిర్వహణపై జనవరి రెండున సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మహేంద్ర నాయుడు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎన్నికల జోనల్ రిటర్నింగ్ అధికారి సతీష్ కుమార్ ఈ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

అన్ని మతాలనూ, కులాలనూ గౌరవించాలి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి
- పాస్టర్ దంపతులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

అన్ని మతాలను, కులాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి కోరారు. మంగళవారం క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్ల దంపతులకు మాధవరం మాజీ సర్పంచి, టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డితో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అని, ఏ మతం, కులమయినా ఒకరినొకరు గౌరవించుకోవాలని తెలిపారు. పాస్టర్లకు రూ.5 వేల గౌరవ వేతనం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాల దృక్పథాన్ని గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ నిర్ణయానికి కృతజ్ఞతగా పాస్టర్లు కూడా రాఘవేంద్ర రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, కోసిగి మండల మాజీ అధ్యక్షులు జ్ఞానేష్, సొసైటీ డైరెక్టర్ మాలపల్లి లక్ష్మన్న, నాయకులు చంద్ర, మల్లికార్జున, పవన్, ఏసేబు, ప్రసాద్ పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

-వైవాహిక జీవితానికి సరైన వయస్సులో వివాహం చేయాలి
-రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్.మహేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బాల్య వివాహము చట్టరీత్యా నేరమని వైవాహిక జీవితానికి సరైన వయస్సులో వివాహం చేయాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్‌మహేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిలిటరీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుచున్న స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధ్యతమైన వైవాహిక జీవితానికి తొలిమెట్టు సరైన వయస్సులో వివాహం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 యేళ్లు నిండనిదే వివాహం చేయరాదని తెలిపారు. తెలిసి తెలియని ఆడిపాడి, చదువుకొనే వయస్సులో పెళ్లిళ్లు చేస్తే తల్లి శారీరక, మానసిక అనారోగ్యంతో బాధపడే అవకాశాలు ఉంటాయన్నారు. బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు కలుగుతాయని, చిన్న వయస్సులో వివాహము చేస్తే గర్భస్రావం, పుట్టబోయే బిడ్డలు చనిపోయి పుట్టడం, తక్కువ బరువుతో జన్మించడం, పుట్టాక మరణించడం, రక్తహీనత, గుర్రపువాతం, నెలలు నిండకనే కాన్పులు, తక్కువ బరువు గల బిడ్డ పుట్టడం, కష్టమైన కాన్పు లాంటి సమస్యలు వస్తాయని తెలిపారు. చిన్న వయస్సులో ప్రసవం ప్రమాదకరమని, చిన్న వయస్సులో పిల్లలు కలిగితే వారిని పెంచే మానసిక వికాసం, స్థోమత తల్లితండ్రులకు ఉండకపోవచ్చని తెలిపారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాలలోపు బాలికలకు 21 సంవత్సరములలోపు అబ్బాయిలకి వివాహం చేస్తే పెళ్లికుమారునికి వారి తల్లితండ్రులకు పెళ్ళిలో పాల్గొన్న వారిపై, పురోహితులపై, ప్రత్యక్షంగా, పరోక్షంగా కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. అనంతరం ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వలన వచ్చే వ్యాధులపై వివరించారు. ఇంచార్జ్ హెడ్ మాస్టర్ సమీవుల్లా, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు వేణుగోపాల్ రెడ్డి, సమీర్, సామజిక ఆరోగ్య అధికారి యశోద, సచివాలయ కార్యకర్త సరళ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, సులోచన, వరాలు , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్.మహేశ్వర ప్రసాద్

క్రిస్మస్, న్యూఇయర్ ప్రత్యేక ఆఫర్లు

3 ఇవి స్కూటర్లు కేవలం రూ.1,05,000

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలో స్కంద క్లౌడ 9 వేణుకా వేణు మోటార్స్‌కు సంబంధించిన ఆర్‌ఆర్‌ఇ- బైక్ కర్నూలు బ్రాంచ్ మేనేజర్ మీనిగ రవికాంత్ రెడ్డి తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ వారి వద్ద ఇ-బైక్‌లు కొనుగోలు చేసినవారికి క్రిస్మస్ , న్యూ ఇయర్ సందర్భంగా 3 ఇవి స్కూటర్లు "కేవలం రూ.1,05,000కు ఇస్తున్నామని తెలిపారు. బైక్ మోడల్స్ ఆకర్షణీయమైన కలర్స్ లో లభ్యమవుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్ , రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా ఇ వాహనాలను నడపవచ్చన్నారు. వాటి ప్రత్యేకతలు కీలెస్ ఎంట్రీ , రివర్స్ డ్రైవ్ , యాంటీ- థెఫ్ట్ , సెంట్రల్ లాక్, చార్జింగ్ పోర్ట్, చార్జర్, స్పీడ్ మోడ్ అండ్ ICAT ధృవీకరణ ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని రవికాంత్ రెడ్డి తెలిపారు.

సిఐటియు జీపుజాతా విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆల్ ఇండియా సిఐటియు 18వ మహాసభలు విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు 4న జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లాలోని వివిధ మండలాల్లో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జీపుజాతా విజయవంతమైంది. కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, న్యూ సిటీ కోశాధికారి సిహెచ్.సాయిబాబా మాట్లాడారు. విశాఖపట్నంలో నిర్వహించే మహాసభల్లో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతినిధులు చర్చిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై వేస్తున్న బారాలు, కార్మిక చట్టాల మార్పులు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. ఆశ అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కరించాలని అనేక అంశాలపై ఈ ఐదు రోజులు జరుగుతున్న మహాసభల్లో చర్చిస్తారన్నారు. నాలుగున జరిగే బహిరంగ సభ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమ శంఖారావం పూరిస్తారని, ఈ మహాసభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉన్నదన్నారు. నాలుగున జరిగే చలో విశాఖ కార్యక్రమంలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్, జె. దివాకర్, కె ప్రభాకర్ సిఐటియు న్యూ సిటీ నగర నాయకులు కె.సుధాకరప్ప, జి ఏసు, శీను, కెవిపిఎస్ నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతానుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్ సాయిబాబా

వీర బాల్ శివానిని సన్మానించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండలానికి చెందిన బీరప్ప,లలిత దంపతుల కుమార్తె ఉప్పర శివానిని ఆర్‌డిఒ భరత నాయక్, తహశీల్దార్ సన్మానించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శివాని ప్రతిభను గుర్తించి, ఆమె కోరికలు నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అధికారులు తెలిపారు. ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన 'వీర్ బాల్ పురస్కారం' అందుకున్న శివానిని ఆర్‌డిఒ తహసిల్దార్ ప్రత్యేకంగా అభినందించారు.జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జావెలిన్ త్రో, షాట్ పుట్ పోటీల్లో శివాని సాధించిన అద్భుత విజయాలను ఆర్‌డిఒ భరత నాయక్ ప్రస్తావించారు. అంగవైకల్యం ఉన్నప్పటికీ, తన ఆత్మవిశ్వాసంతో ప్రతిభను నిరూపించుకున్న శివాని ఇతర విద్యార్థులకు, క్రీడాకారులకు గొప్ప ఆదర్శమని కొనియాడారు.

డాక్టర్ సుధారాణి సేవలు అభినందనీయం

ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుధారాణి విభాగాధిపతిగా చక్కటి సేవలు అందించారని తన విభాగాన్ని సజావుగా ఎటువంటి ఇబ్బందులు రానివ్వకుండా తన పదవీకాలంలో చక్కగా నడిపించించారని ఆమె సేవలు గురించి కొనియాడారు. మంగళవారం మెడికల్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఫిజియాలజీ విభాగ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సుధారాణి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమె వీడ్కోలు ఘనంగా ఏర్పాటు చేసి సన్మానించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్ మాట్లాడుతూ డాక్టర్ సుధా రాణి కుటుంబంలో అత్యధిక మంది వైద్యవిద్యలో రాణించారని అన్నారు. ఇటీవలే ఫిజియాలజీ వారోత్సవాలను ఆమె చాలా ఘనంగా నిర్వహించారని కొనియాడారు. విద్యార్థులతో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఎపిజిడిఎ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ ఎపిజిడిఎకు గుర్తింపు లభించినందుకు ప్రభుత్వానికి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వైద్యుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుక రావాలని కోరారు. సన్మాన గ్రహీత ఫిజియాలజీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వీసు చాలా సంతృప్తిరస్తుందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పనిచేసిన కాలం ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. తన విభాగంలోని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సిబ్బంది పూర్తిగా సహకరించడం పట్ల సంతోషంగా వుందని అందరికీ ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, వివిధ విభాగాధిపతులు ప్రొఫెసర్ శ్రీరాములు, డాక్టర్ రాజేష్, ప్రొఫెసర్ రాం శివనాయక్, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ఆదిమూలపు సతీష్, డాక్టర్ అరుణ డాక్టర్ రేణుక, ఎపిజిడిఎ నాయకులు డాక్టర్ దామం శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాధిక, డాక్టర్ ఎలిజబెత్ రాణి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సోమ శేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ సురేష్, డాక్టర్ తులసి, లెక్చరర్ సురేష్ కుమార్, పాల్గొన్నారు.

డాక్టర్ సుధారాణిని సన్మానిస్తున్న వైద్యాధికారులు , సిబ్బంది

డిఐజి కోయప్రవీణ్‌ను సన్మానిస్తున్న పత్తిఓబులయ్య తదితరులు

డిఐజిని సత్కరించిన కళాకారులు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు కడప పోలీస్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ ను మంగళవారం సాయంత్రం టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో కళాకారుల బృందం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువా పుష్పమాల జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాయలసీమలో శాంతి భద్రతలను కాపాటంలో ఆయన కషిని అభినందించారు. డిఐజి కోయ ప్రవీణ్ కళా సాహితీ రంగాలలో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. కళాకారుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా కళాకారులకు హామీ ఇచ్చారు. నందిఅవార్డు గ్రహీత, ప్రముఖ గజల్ గాయకులు మహమ్మద్ మియా సామాజిక చైతన్యం కలిగిన గజల్స్ పాడి ఆయనకు వినిపించారు. కార్యక్రమంలో కళాకారులు కెవి రమణ, బాల వెంకటేశ్వర్లు, జి. శ్రీనివాస్ రెడ్డి, సివిరెడ్డి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
బుధవారం 31 డిసెంబర్ 2025 8
నంద్యాల

దిగుబడి లేదు.. ధర లేదు..

కొత్తపల్లిలో వరిపంటను యంత్రంతో కోత కోస్తున్న దృశ్యం

- సగానికి తగ్గిన వరి దిగుబడి
- ఎకరాకు 20 బస్తాలు మాత్రమే
- పెట్టుబడులు కూడా రాని వైనం
- అప్పుల ఊబిలో అన్నదాతలు
- దెబ్బతిన్న వరికి నష్టపరిహారం ఊసెత్తని పభుత్వం

ఈ ఏడాది వరి పంట సాగు చేసిన రైతులకు మొదటి నుండి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. అతివృష్టి, అనావృష్టితో పాటు ప్రభుత్వ విధానాలు కూడా రైతులను దెబ్బతీస్తున్నాయి. అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆచరణలో ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా నష్టపరిహారం చెల్లించ లేదు. మరోపక్క అధిక వర్షాలతో వరి దిగుబడి గణనీయంగా పడిపోయింది. వచ్చిన అరకొర పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎకరాకు 40 బస్తాలకు గాను 20 బస్తాల దిగుబడి మాత్రమే రావడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోనిగువ్వలకుంట్ల, బండినాయిని పాలెం, జి.వీరాపురం, శివపురం, గుమ్మడాపురం, బావాపురం, సింగరాజుపల్లి, నందికుంట గ్రామాలలో ఖరీఫ్‌లో 3,145 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుండి రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యూరియా కష్టాలను అధిగమించి పంటను కాపాడుకున్న తరుణంలో మొంథా తుపాన్ రూపంలో దిగుబడిపై దెబ్బ తీసింది. వరి కంకి విరిచే దశలో అధిక వర్షాలతో పంటలు నీటమునిగాయి. తుఫాన్ ప్రభావం నుంచి కోలుకొనేలోపే వరిలో ఎండాకు తెగులు, తెల్ల వెన్ను తెగులు రైతులను కుదేలు చేశాయి.

దిగుబడి తగ్గింది.. ధర పతనం..

దిగుబడి బాగా వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయింది. గతంలో ఎకరానికి 30 నుండి 40 బస్తాల దాకా దిగుబడి రాగా ప్రస్తుతం 20 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. వరి ధాన్యం దిగుబడి తగ్గడంతోపాటు ధర కూడా పతనమయింది. గతంలో కర్నూలు సోనామసూరి వడ్లు బస్తా గరిష్టంగా రూ.2700 అమ్మగా ప్రస్తుతం రూ.1450 కూడా అమ్ముడుపోవడం లేదు. నంద్యాల సోనా వడ్లు బస్తా ధర గతంలో రూ.2800 అమ్ముడుపోగా ఇప్పుడు రూ.1600కు మించి అమ్ముడుపోవడం లేదు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతు పరిస్థితి అగమ్యగోచరం

ఈ ఏడాది కౌలుకు పంట పొలాలను సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 15 బస్తాలు దిగుబడి తగ్గడంతో కౌలు చెల్లించేందుకు కూడా ధాన్యం సరిపోని పరిస్థితి నెలకొంది. ఎకరానికి కౌలుతో సహ పంట సాగుకు పెట్టుబడి మొత్తం రూ రూ.40 వేలు ఖర్చు అయింది. ఎకరాకు దిగుబడి 22 బస్తాలు వస్తే ఇంకా రూ. 15000 వేలు కౌలు రైతులు అప్పు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

8 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మొత్తం పెట్టుబడి రూ.2.50 లక్షలు అయింది. గత ఏడాది ఎకరాకు 32 బస్తాలు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఎకరాకు 17 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ధర తక్కువగా ఉండడంతో పెట్టుబడికి కూడా రాలేదు. కౌలు చెల్లించేందుకు కష్టంగా ఉంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

- రైతు రామదాసు, గువ్వలకుంట్ల గ్రామం.

దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది

ఒక ఎకరంలో వరి సాగు చేశాను. ఎకరాకు 22 బస్తాల దిగుబడి వచ్చింది. గత ఏడాది 33 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది సుమారుగా 18 బస్తాలు దిగుబడి తగ్గింది. వరి పంట కోసం తెచ్చిన పెట్టుబడి కూడా రావట్లేదు. ఆరు నెలల పాటు ఎంతో కష్టపడి పగలనక, రాత్రిక పంట పండిస్తే గిట్టుబాటు ధర కూడా లభించడం లేదు.

- రైతు పరుశ రాముడు, కొత్తపల్లి.

పెట్టుబడి కోసం చేసిన అప్పులు కూడా తీరడం లేదు

14 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. మొత్తం సాగు కోసం రూ.4.25 లక్షలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను. ఎకరానికి 23 బస్తాల లెక్కన దిగుబడి వచ్చింది. మొత్తం అమ్ముకుంటే రూ.3.50 లక్షలు మాత్రమే డబ్బులు వస్తున్నాయి. పెట్టుబడి కూడా రాలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- రైతు చంద్రశేఖర్ రెడ్డి, గువ్వలకుంట్ల గ్రామం.

నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

ఈ ఏడాది వరి పంటలు వేసి నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వం ఆదుకోవాలి. రైతులు వేసిన పంటలన్నీ అరకొరగా పండాయి. అరకొరగా పండిన పంటలకు గిట్టుబాటు ధర లేదు. కనీసం రైతులు పంటల కోసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి.

- స్వాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

చెంచు గిరిజనులకు దీర్ఘకాలిక జీవనోపాధి

- నైపుణ్యాధారిత ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ జి.రాజకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని చెంచు గిరిజనులకు మెరుగైన, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గిరిజన ఉత్పత్తులపై శిక్షణ, జీవనోపాధి అవకాశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 48 చెంచుగూడెంలలో సుమారు 9 వేల మంది గిరిజనులు నివసిస్తున్నారని, వీరిలో ఎక్కువ మంది అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తేనె, ఉసిరి (ఆమ్లా), ఇతర అటవీ ఉత్పత్తుల సేకరణతో పాటు, జ్యూట్ బ్యాగుల తయారీ, గుడ్డ సంచులు, పేపర్ కప్పులు, పుట్టగొడుగుల సాగు, తేనెటీగల పెంపకం వంటి నైపుణ్యాధారిత కార్యకలాపాల ద్వారా వారికి మెరుగైన ఆదాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధి ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించి సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నాటుసారా కాయడం, సేవించడం వంటి దురలవాట్లకు స్వస్తి చెప్పి, నైపుణ్యాభివృద్ధి వైపు గిరిజనులను ఆకర్షించి ప్రత్యామ్నాయ జీవనోపాధులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. జ్యూట్ బ్యాగులు, జ్యూట్‌ఫోం ఉత్పత్తులు, పేపర్ కప్పుల తయారీ వంటి కార్యకలాపాలను శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాలలో అనుసంధానం చేయాలని ఆదేశించారు. డిఆర్‌డిఎ వద్ద మార్కెటింగ్ కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం అందుబాటులో ఉందని, ఐటిడిఎ, డిఆర్‌డిఎ ద్వారా ఆర్‌ఎస్ సభ్యులను గుర్తించి శిక్షణ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా తేనెటీగల పెంపకానికి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని క్షేత్రాలు, అన్ని ఆలయాలలో, జాతర రోజుల్లో స్థానిక గిరిజన ఉత్పత్తుల విక్రయానికి స్టాల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉత్పత్తి-నైపుణ్యం-మార్కెటింగ్ మూడింటినీ అనుసంధానం చేసి సమగ్రంగా పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నంద్యాలలో 25 లక్షల వ్యయంతో బ్యాంకు సహకారంతో యూనిట్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిఎఫ్‌ఓ, డిఆర్‌డిఎ పిడి, ఐటిడిఎ పిఓ, డిఆర్‌ఓ రామునాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్లను కలెక్టర్ పరిశీలన

పట్టణంలోని బెస్ట్ మార్కెట్ యార్డ్‌లో ఈవిఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల వద్ద ఏర్పాటు చేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవిఎంల భద్రతకు సంబంధించి చేపట్టిన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న విషయాన్ని కలెక్టర్ సమీక్షించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేసి తనిఖీలను అధికారికంగా నమోదు చేశారు. ఈవిఎం గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తాసిల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డిటి మనోహర్, కాంగ్రెస్ నుండి సయ్యద్ రియాజ్ భాష, టిడిపి శివరామిరెడ్డి, వైసిపి సాయిరాం రెడ్డి, బిజెపి చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రదీప్, సిపిఐ నరసింహులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్ ను పరిశీలించి వస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

న్యూ ఇయర్ వేడుకలకు నిబంధనలు

- ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాట్లాడుతున్న ఎస్‌పి సునీల్ షోరాణ్

జిల్లా పరిదిలో న్యూ ఇయర్ వేడుకలను ప్రశాతంగా జరుపుకోవాలని, నిభందనలను పాటించి పోలీస్ వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక మీడియాతో ఎస్‌పి మాట్లాడారు. న్యూ ఇయర్ ఈవెంట్స్ జరుపుకునే వారు ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవా లన్నారు. సీసీ కెమరాల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేడుక కార్యక్రమాలు నిర్వహించే వారు మ్యూజిక్ సిస్టమ్ రాత్రి 10 గంటల తరువాత వాడరాదన్నారు. రాత్రి 10 గంటల తరువాత పోలీసులు వాహనల తనిఖీ చేపట్టనున్నందున ఆత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. మేగజైన్స్, హోర్డింగ్స్ లలో అశ్లీలత కల్గిన పోస్టర్లు, ప్రకటనలు వేయరాదన్నారు. బార్లు, వైన్ షాపులు నిర్ణీత సమయంలోగా మూసివేయాల్సి ఉంటుం దన్నారు. బైక్ రేసర్లపై నిఘా ఉంచుతామన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అన్ని చర్యలను తీసుకుంటున్నామని, పోలీసులకు సహకరించాలని సూచించారు. పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని వివరించారు. నిభందనలు పాటిస్తూ న్యూ ఇయర్ వేడుకలు అందరూ సంతోషంతో జరుపుకోవాలని, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని, సిఎం కార్మిక ద్రోహులు

- సిఐటియు మహాసభల జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్టంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు కార్మిక హక్కులను హరిస్తూ కార్మిక ద్రోహులుగా మారుతున్నారని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కెఎండి గౌస్, పి.వెంకటలింగం, సీనియర్ నాయకులు తోట మద్దులు విమర్శించారు. విశాఖ పట్టణంలో ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగు సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నంద్యాల పట్టణంలో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిఐటియు ఆఫీసు నుండి బయలుదేరి జనరల్ హాస్పిటల్, తహశీల్దార్ కార్యాలయం, పద్మావతి నగర్ ఆర్చి, మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు, బంగారు అంగళ్లు, గాంధీ చౌక్ సెంటర్ మీదుగా ఆత్మకురు బస్టాండ్ గంగా హోటల్ వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై చర్చిస్తారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ పరం చేస్తూ పని గంటలను పెంచడం దారుణమన్నారు. 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లు చేసి కార్మికులను నయా బానిసలుగా మార్చడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్లకు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, విఓఎలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, జిరాంజి బిల్లును రద్దు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ కార్మిక విధానాలపై రాబోవు మూడు సంవత్సరాలలో పోరాటాలు చేయడానికి ఈ మహాసభలలో 2 వేల మంది ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోబోతున్నారని తెలిపారు. కార్యక్రమం లో నాయకులు సుబ్బారావు, జైలాన్, హుసేని, శ్రీను, వెంకట్రావు, అంజి, పెద్దన్న, బుజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ చేపడుతున్న నాయకులు

వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కొండపేట కొట్నాల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. భక్తులు తెల్లవారుజామున నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చిఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మాణంలో ఉండడంతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పట్టణంలోని రవ్వలకొండ మీద ఉన్న చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2 నుండి గ్రామసభలు

ప్రజాశక్తి - రుద్రవరం

భూముల రీ సర్వేలపై 2026 జనవరి 2 నుండి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ధోనిఆల్ఫ్రెడ్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు గ్రామాలలో భూముల రీ సర్వేలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వేతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దారు మహమ్మద్ హుస్సేన్, సర్వేయర్ నాగరాజు నాయక్, విఆర్వోలు వెంకటనారాయణ, నీలకంఠ, హుస్సేన్, కార్యదర్శి మహేష్, సచివాలయ సర్వేయర్లు వందన, సరస్వతి, ఆయా గ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పాణ్యం : పాణ్యంలో జనవరి 2 నుండి నిర్వహిస్తున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని వినియోగించు కొని రైతులు తమ పొలాల సరిహద్దులు, ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ శివారెడ్డి, ఆర్ఐ రాము, మండల సర్వేయర్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దానం ఫ్రీ సర్వే పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలోని పాలిటెక్నిక్, డీగ్రీ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విద్యార్థుల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సుధీర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 డిసెంబర్ 30, 31వ తేదీలలో త్రివేంద్రంలో రెండు రోజులపాటు జరిగిన మహాసభలలో ఎస్‌ఎఫ్‌ఐ ఏర్పడి నాటి నుంచి నేటి వరకు అధ్యయనం, పోరాటం అనే నినాదాలతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయాలతో విద్యార్థుల కోసం అనేక పోరాటాలు చేస్తూ 55 సంవత్సరాలు పూర్తిచేసుకుని 56వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందన్నారు. నంద్యాల టౌన్ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదారవాద, మతోన్మాద విధానాలతో విద్యలో అనేక మార్పులు తీసుకువస్తూ విద్యార్థులను విద్యార్థి ఉద్యమం, వారి హక్కుల కోసం పోరాటం చేయకుండా పక్కదారి పట్టిస్తూ కార్పొరేట్ చదువులు ఉద్యోగాల వైపు మళ్ళిస్తున్నారని అన్నారు. వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025 బిల్లును తీసుకొచ్చి ఉన్నత విద్యను కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయికరణ చేస్తూ విశ్వవిద్యాలయాలను లోన్ ఏజెన్సీలుగా మారుస్తూ పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత విద్యకు దూరం చేస్తూ కార్పొరేట్‌ల లాభాల కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ కార్పొరేట్ పాఠశాలలకు శంకుస్థాపన చేస్తూ గ్రామీణ, మండలాల్లో విద్యార్థులకు ప్రైవేట్ విద్యను తప్పనిసరిగా అనుసరించాల్సి వచ్చే విధంగా చేస్తున్నాయన్నారు. మెడికల్ విద్యను ప్రైవేట్ వ్యాపార వస్తువుగా మారుస్తూ పిపిపి విధానాన్ని తీసుకొచ్చి ప్రైవేట్ పరం చేస్తుందని, ఇప్పటికైనా మెడికల్ కాలేజీల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుని నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ టౌన్ నాయకులు సాయి, విజయ్, ధను, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మండలం దిగువ అహోబిలం క్షేత్రంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా యోగివేమన రెడ్ల నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దేవస్థానం స్వాతి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆళ్లగడ్డ వెంకటసుబ్బారెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సారెడ్డి నరసింహారెడ్డి, డాక్టర్ శివ నాగేశ్వరమ్మ, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ లక్ష్మి రెడ్డి, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ హనీషా, డాక్టర్ చంద్రిక, డా.రామలక్ష్మి తదితరులు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ అహోబిలం కొండ ప్రాంతంలో ఉండడంతో ఎక్కువగా మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లిఖిత్ రెడ్డి, స్వాతి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ సాయి తేజస్విని, ఫార్మాసిస్ట్ మధు సూదన్, సిబ్బంది అజయ్ కుమార్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత

- సంక్రాంతికి గుంతల రహిత రహదారులే లక్ష్యం : మంత్రి బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను ఎలా అమలు చేస్తారో చూస్తామని చెప్పిన వైసిపికి షాక్ ఇచ్చేలా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి చూపించామని రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి మంత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వపు చీకటి పాలనను పూర్తిగా రూపుమాపుతూ రాష్ట్రంలో సరికొత్త వెలుగులు ప్రసరింపజేస్తూ ఈ ఏడాది కూటమి ప్రభుత్వ పాలన సుస్థిర విధానాలు, నూతన సంస్కరణలతో విజయవంతంగా సాగిందని తెలిపారు. తల్లికి వందనం పథకం ఇంట్లో ఎంతమంది చిన్నారులు ఉంటే అంతమందికి వర్తింపజేశామన్నారు. పింఛన్లు రూ. 3 వేల నుంచి 4 వేలకి పెంచినట్లు తెలిపారు. దీపం పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్నదాత సుఖీభవ అమలు, రాష్ట్రస్థాయిలో స్త్రీ శక్తి పథకం కింద ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేశామన్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తరచుగా చెప్పే మాటల స్ఫూర్తితో వైసిపి నేతల దుష్ప్రచారాన్ని సవాల్‌గా తీసుకొని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను సూపర్ సక్సెస్ చేసిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్న క్రమంలో రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టి సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారుల లక్ష్యంగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో గత ఏడాదిన్నర కాలంలో రౌడీయిజం తగ్గడంతో క్రైమ్ రేట్ సైతం తగ్గిందని తెలిపారు. గతంలో విచ్చలవిడిగా దొరికిన గంజాయి, డ్రగ్స్ సరఫరాను ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి అరికట్టగలిగామన్నారు. చంద్రబాబు వంటి బలమైన, నమ్మకమైన నాయకత్వం, సుస్థిర ప్రభుత్వంతోనే ఆంధ్రప్రదేశ్ సుస్థిరాభివృది సాధ్యమని తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

యూరియా పంపిణీలో రాజకీయం తగదు : ఎంపిపి

ప్రజాశక్తి - గోస్పాడు

మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలో యూరియా పంపిణీ విషయంలో రాజకీయాలు చేస్తున్నారని, అలా చేయడం మంచి పద్ధతి కాదని ఎంపిపి ఆర్థర్ సైమన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ విషయంలో గ్రామస్థాయి టిడిపి లీడర్లే ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, ముందుగానే టోకెన్లు రాస్తూ, వాటికి సరిపడా డబ్బులను కూడా ముందుగానే వసూలు చేసుకుని, యూరియా పంపిణీ చేసే రోజు నామమాత్రంగా 20 నుంచి 30 మంది రైతులకు 2 బస్తాల చొప్పున ఇస్తున్నారనే ఆరోపణలు మండల వ్యాప్తంగా వస్తున్నాయని అన్నారు. అధికారుల ద్వారానే రైతులకు యూరియాను పంపిణీ చేయాలన్నారు. ఆర్టీసీ వారు గోస్పాడు మండల కార్యాలయాల వద్ద ఉన్న రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులను నిలపడం లేదన్నారు. ఇప్పటినుంచైనా రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులను ఆపాలని సూచించారు. అనంతరం మండల అధికారులు వారి వారి శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. ఈ సమావేశానికి పోలీసు శాఖ మినహా, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పిటిసి జగదీశ్వరమ్మ, మండల ఉపాధ్యక్షులు జనార్దన్ రెడ్డి, కేడెం రాజు, ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచులు, పంచాయితీ సెక్రటరీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమన్

వాట్సప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం

- డిప్యూటీ ఎంపిడిఒ అశ్విన్ కుమార్

ప్రజాశక్తి - శిరివెళ్ల

మాట్లాడుతున్న అశ్విన్ కుమార్

ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మొబైల్ ద్వారానే ఇంటి వద్ద నుంచి అత్యంత సులువుగా ప్రభుత్వ సేవలు పొందేందుకు వీలుగా రూపొందించిన వాట్సప్ గవర్నెన్స్‌ను వినియోగించుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీఓ అశ్విన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 9552300009 వాట్సప్ నెంబరు ద్వారా 158 రకాల ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు అందజేస్తుందన్నారు. రానున్న రోజుల్లో వెయ్యి సేవలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

కలెక్టర్‌కు శ్రీశైలం ప్రసాదం అందజేత

ప్రసాదం అందిస్తున్న డాక్టర్ భరద్వాజ శర్మ

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారికి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు డాక్టర్ భరద్వాజ శర్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి భ్రమరాంబ మల్లికార్జున స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఆశీస్సులు నిరంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి కుటుంబ సభ్యులకు ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. శ్రీశైల దేవస్థానం అభివృద్ధి కోసం కలెక్టర్ రాజకుమారి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆలయ అభివృద్ధిలో మేము భాగస్వాములు అయినందుకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ ప్రజాప్రతినిధులకు మంచి జరగాలని ఆకాంక్షించారు.

యాచకులకు సిఐటియు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం దేవస్థానంలోని యాచకులకు సిఐటియు, హమాలి వర్కర్స్ సిఐటియు జిల్లా నాయకులు మునిపాటి చిన్న మారెన్న, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగ వెంకటేశ్వర్లు, పి. నాగేశ్వరరావు, బి. వెంకటస్వామి, రంగస్వామి, ఆవులయ్య, ముగెన్న, నారాయణ, పెద్ద గంగులు, హనుమంతరెడ్డి, చిన్న గంగులు, పవన్ రెడ్డి, బీమలింగడు, మల్లయ్య పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ప్యాపిలి

న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జున పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించే డీజేలు టపాసులు నిషేధమన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రిపుల్, రాష్, రాంగ్ రూట్ డ్రైవింగ్, దాడులు, బెదిరింపులకు పాల్పడడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్, ఆకస్మిక తనిఖీ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపించి ఇబ్బందులు పడవద్దన్నారు. మద్యం షాపులు నిర్ణీత సమయానికి మూసివేయాలని, రోడ్లపై నూతన సంవత్సర వేడుకలకు అనుమతి లేదన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

బనగానపల్లె మండలం యాగంటి దగ్గర గల శ్రీ మారునీళ్ల చెలిమే దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బత్తుల రామకృష్ణారెడ్డి, బత్తుల రమణారెడ్డి, బత్తుల రామ్మోహన్ రెడ్డి, యాత్రికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండగగా కళ్యాణోత్సవం


కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ భూనిలా సమేత కళ్యాణ మహోత్సవం మంగళవారం కన్నుల పండగగా నిర్వహించారు. ముందుగా తెల్లవారుజామున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. అనంతరం ఆలయ ఇఒ దంపతులు ఉత్సవ విగ్రహాలను వైభవంగా కళ్యాణ మండపానికి ఊరేగింపుగా తెచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు.

చేరువంక బ్రిడ్జికి భూమి పూజ

భూమి పూజ చేస్తున్న మంచాల మద్దిలేటి రెడ్డి

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండలంలోని రామిరెడ్డి పల్లె గ్రామంలో చేరువంక బ్రిడ్జికి టిడిపి సీనియర్ నాయకులు మంచాల మద్దిలేటి రెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. మంచాల మద్దిలేటి రెడ్డి మాట్లాడుతు అభివృద్ధి పథంలో భాగంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేరువంక బ్రిడ్జికి రూ. 19లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. సంజామల మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందఅన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ప్రతాపరెడ్డి, తులసి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఆర్‌డిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ నాగజ్యోతి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రజల నుండి వచ్చే వినతి పత్రాలకు అధికారులు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఆత్మకూరు ఆర్‌డిఒ నాగజ్యోతి అన్నారు. ఆర్‌డిఒ కార్యాలయంలో తహశీలార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్ఐలతో ఆమె మంగళవారం సమావేశమై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఈ-ఆఫీస్, హౌస్ సైడ్స్, మ్యుటేషన్, కోర్టు కేసులు, రీసర్వే, నేషనల్ హైవే క్లెయిమ్స్, పిజిఆర్ఎస్, పిపిబి డిస్ట్రిబ్యూషన్ వంటి సమస్యలను వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాలకు చెందిన రెవెన్యూ అధికారులు హాజరు అయ్యారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం : ఎస్ఐ

స్వాధీనం చేసుకున్న నాటుసారా

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మండలంలోని బొల్లవరం గ్రామంలో నాటుసారా అమ్ముతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు బ్రాహ్మణ కొట్కూరు ఎస్ఐ మణికంఠ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణానికి చెందిన షికారి సురేష్ బొల్లవరం గ్రామంలో నాటుసారా అమ్ముతుండగా అతనిని అరెస్టు చేసి అతని వద్ద నుండి పది లీటర్ల నాటు సారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. నాటసాం విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం గోపవరం గ్రామ సమీపంలో రైలు కిందపడి రాజు(23)అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన ఇతడు మంగళవారం తెల్లవారుజామున ఈ ఘాతుకానికి పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ

- ఘనంగా 56వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ అని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. దినేష్ కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయి, తేజ అన్నారు. ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగ స్థానిక ఎపిఎస్ ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట ఎస్ఎఫ్ఐ జెండాను మండల అధ్యక్షుడు సాయి మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అధ్యాయనం, పోరాటం నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయ సాధన కోసం 1970లో కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావించిందన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యా రంగంలో వస్తున్న వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిపికొడుతూ అందరికి విద్య, అందరికి ఉపాధి లక్ష్యం కోసం, పేద బడుగు బలహీన వర్గ విద్యార్థుల బాగు కోసం అనేక సందర్భాల్లో పోలీసుల లాఠీల దెబ్బలకి, అక్రమ కేసులకి వెనకడుగు వేయకుండా మా దేహం ముక్కలైన ఈ దేశాని ముక్కలు కానివ్వం అని నినదిస్తుందన్నారు. కార్యకర్తలు ప్రాణ త్యాగం చేసిన ఘన చరిత్ర ఎస్ఎఫ్ఐదే అని అందుకే విద్యార్థుల మన్ననలు పొంది దేశంలో అతి పెద్ద విద్యార్థి సంఘంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని సంక్షేమ వసతి గృహాలు సొంత భవనాలు ఏర్పాటు చేసి హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ మెస్ బిల్లులు విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాల, పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ శివారులో ఉన్న కెజిబివి పాఠశాలకు వీధిలైట్లు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పాఠశాలలో అబ్బాయిలకు టాయిలెట్స్ లేక బయటికి వెళ్లి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా రంగంలో కొత్త కొత్త జీవోలను తీసుకొచ్చి విద్యను పూర్తిగా వ్యాపారం చేసిందని విమర్శించారు. బాలల ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం ప్రకారం 6-14ఏళ్ల పిల్లలకు ఉచిత నిర్బంద విద్యను అందించాల్సిన ప్రభుత్వమే విద్యను వ్యాపారం చేస్తూ నాశనం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీవోలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు అందరికి విద్య, అందరికి ఉపాధి కోసం పని చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, వేణు, నవీన్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ప్యాపిలి

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆ సంఘం మండల అధ్యక్షులు రాజేంద్ర ఆధ్వర్యంలో ప్యాపలి మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఇఒలు మహేశ్వర రెడ్డి, వెంకటేష్ నాయక్‌లు మంగళవారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ యుటిఎఫ్ డైరీ ప్రతి ఉపాధ్యాయుని వద్ద ఉండాలన్నారు. అందులో ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్‌తోపాటు విద్యా సంబంధ సంపూర్ణ సమాచారం ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం యుటిఎఫ్ అని, భవిష్యత్‌లో పిఆర్‌సి, ఐఆర్ కోసం మనకు రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్యాపలి మండల సహాధ్యక్షులు అబ్దుల్ రహీం, నాగమణితోపాటు కార్యకర్తలు, నాయకులు అమీర్ బాషా, షేక్షావలి, నరసింహయ్య, కీర్తి చందర్, మహబూబ్ బాషా, సురేష్, అంబటి సుబ్బయ్య, పురుషోత్తం, భాను ప్రసాద్, నాగిరెడ్డి, పక్కీరమ్మ, శాంతిప్రియ, అస్మా బేగం, నస్రీన్, యాస్మీన్ పాల్గొన్నారు.

రైతులకు భారంగా పశుపోషణ

- వెంటాడుతున్న పశుగ్రాసం కొరత - యంత్రాల ద్వారా ఎండు గడ్డి నూర్పిడి
- ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ.20 వేలు
- ఖర్చు ఎక్కువ దిగుబడి తక్కువ - ఆందోళనలో పాడి రైతులు
- ఏడాదికి 12 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసం అవసరం

పశుగ్రాసం

ప్రజాశక్తి - పాములపాడు

నేటి ఆధునిక కాలంలో పశువుల పెంపకం రైతులకు భారంగా మారుతోంది. ఎండుగడ్డి తగినంత లేకపోవడం, పచ్చిక బయళ్లు, ఖాళీ బంజరు భూములు తగ్గిపోవడం వంటి కారణాలతో పశువులకు మేత కరువవుతోంది. దీనికి తోడు ప్రభుత్వ ప్రోత్సాహం కరువడంతోపాటు కూలీల కొరత వేధిస్తుండడంతో పశు పోషణ రైతులకు భారంగా మారింది. పూర్వం ప్రతి రైతు కమతం గొడ్లశాల, గడ్డివాము, పాడి పశువులతో నిత్యం కళకళలాడేది. నేడు రైతుల కళ్ళలో ఆనందం కనిపించట్లేదు. పల్లె ప్రజలు సైతం ఆరోగ్య, దొడ్ల సంగం, విజయ వంటి కంపెనీలకు చెందిన పాల ప్యాకెట్‌లపై మొగ్గు చూపుతున్నారు. గతంలో ఓ సాధారణ రైతుకు వ్యవసాయంతోపాటు పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయం చేకూరేది. గేదె పాలు ఇంటి అవసరాలకు పోను, మిగిలిన పాలు విక్రయించుకొని కుటుంబాన్ని పోషించుకునే వారు. పల్లె సీమలంటేనే పాడి పంటలకు నెలవు. అటువంటి పల్లెల్లో నేడు వ్యవసాయం కళ తప్పుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లజాతి పశువుల కన్నా సల్లజాతి గోవులే అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.39 లక్షల పాడి పశువులు ఉండగా వాటిలో 83 వేల గేదెలు, 56 వేల ఆవులు ఉన్నాయి. ఒక గేదె లేదా అవుకు ఏడాది పొడవునా రెండున్నర ఎకరాల వరి గడ్డి అవసరం అవుతుందనీ రైతులు తెలిపారు.

పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది
- జడల శ్రీనివాసులు, రైతు, రుద్రవరం గ్రామం

సహజంగా గేదె, ఆవు సరాసరిన రోజుకు 5 నుంచి 7లీటర్ల వరకు పాలు ఇస్తుంది. కూలి రేట్లు పెరగడంతో వరి మసూళ్లను యంత్రాలతో చేపట్టారు. ఈ కారణంగా ఎండు గడ్డి దొరకట్లేదు. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది. ఎకరం ఎండుగడ్డి మిషన్తో కోసిందయితే రూ.4 వేలు ఉంది. అదే కూలీలతో కోసిందైతే రూ.10 వేలు పైనే పలుకుతోంది. పచ్చిక భూములు, సొంత భూములు లేకపోవడంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడుతుంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా పాలు దిగుబడులు లభించకపోవడంతో పాడి పరిశ్రమలు కనుమరుగవుతున్నాయి. పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు చెప్పే హామీలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి.

పశు గ్రాసం రాయితీలకు మంగళం
- టి వెంకటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

ప్రభుత్వాలు రైతులకు ఇచ్చే రాయితీలకు మంగళం పలకడంతో పశుగ్రాసం ఇబ్బందులు మరింతగా పెరిగాయి. నానా ఆవస్తులు పడాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో సైలేజ్ గడ్డిని రైతులకు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం ఇవ్వట్లేదు. పశుక్రాంతి పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులకు పాడి పశువులకు రాయితీ అందించే పథకానికి మంగళం పాడేశారు. పశువులు మరణిస్తే బీమా వర్తించట్లేదు. పశ్కు సమగ్ర క్షేత్రాలు, పశుగ్రాసం కోసం ఇచ్చే ప్రోత్సాహం నిలిచిపోయాయి. పాడి పశువుల పెంపకం రైతులకు గుదిబండలా మారింది. భవిష్యత్తులో పాడి పరిశ్రమ కనుమరుగై కృత్రిమ పాలు, ప్యాకెట్ పాలకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పశు పోషణ భారమవుతుంది
- ఎస్ బాలయ్య, రైతు, చెలిమిళ్ళ గ్రామం.

పశుగ్రాసం ధర అమాంతంగా పెరిగింది. ప్రస్తుతం పశుపోషణ భారం అవుతుంది. వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ ఎంచుకున్నాం. 8ఏళ్ల నుండి నాలుగు పాడి పశువు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. పశువుల పోషణకు నెలకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ. 20 వేలు ఖర్చు అవుతుంది. పశుగ్రాసం ధర విపరీతంగా పెరగడంతో పశుపోషణ భారం అయ్యింది. రైతులకు ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు కల్పిస్తే పాడి పరిశ్రమ మరింతగా మెరుగుపడానికి అవకాశం ఉంది.

ఇచ్చిన హామీలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకవెళ్తుందని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, పవన్ కళ్యాణ్ పట్టుదల కేంద్ర ప్రభుత్వ మద్దతు కలిసి రాష్ట్రానికి ఒక కొత్త భరో ఇచ్చాయని, కొద్ది కాలంగా నిలిచిపోయిన అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. 2025లో కూటమి ప్రభుత్వ విజయాలు సాధించిన విజయాలన ఒకసారి చూస్తే సూపర్ సిక్స్ పథకాల సూపర్ హిట్ చేశామని,తల్లికి వందనం పథకం రూ.10,090 కోట్లు చెల్లింపు, 67.27 లక్షల మంది విద్యార్థులకు అందించింది. స్త్రీ శక్తి ఆగస్ట్ 15 నుంచి పథకం ప్రారంభం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇప్పటి వరకు 3.25 కోట్ల ప్రయాణాలు ఇప్పటి వరకు ఈ పథకానికి రూ.1,144 కోట్ల వ్యయం అయిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 46 లక్షల మంది రైతులకు... రూ.6,310 కోట్లు రైతుల ఖాతాలో జమచేశామని, దీపం2 ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, రూ.2,684 కోట్లు, ఇప్పటికి దాదాపు 2 కోట్ల సిలిండర్ల పంపిణీ చేశామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇప్పటివరకు రూ.50,000 కోట్లకు పైగా పెన్షన్ల కోసం వ్యయం ఏడాదిలో రూ.33,000 కోట్లు పంపిణీ, నెలకు రూ.2,750 కోట్లు, మత్స్యకార భరోసా : ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు ఇచ్చామన్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామన్నారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ల సేవలో ఏడాదికి రూ.15,000 రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ది కూటమి ప్రభుత్వం చేకూర్చిందన్నారు. అన్నా క్యాంటిన్ 204 అన్నా క్యాంటిన్లు. ఇప్పటి వ రకు 4 కోట్ల భోజనాలు అందించామని,గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయించామన్నారు. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ ఏడాది మైనారిటీ సంక్షేమానికి రూ. 3,670 కోట్లు వ్యయం. 158,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం రూ.51 కోట్లు ఇమామ్‌లకు నెలకు రూ.10,000 మౌజన్లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు.పురోహితులకు నెలకు రూ.15,000కు వేతనాల పెంపు -నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000కు వేతనాల పెంపు. జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం - మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ.మెగా డీఎస్సీ ముఖ్యమంత్రి తొలి సంతకం. 15,941 టీచర్ పోస్టుల భర్తీ. 20. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి, రూ.4,500 నుంచి రూ.12,500కు స్టైఫండ్ పెంపు.అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు దాదాపు 84 లక్షల టన్నుల చెత్త తొలగింపు ప్రతీ నెల 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'. డోర్ టు డోర్ కలెక్షన్. రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు. మరో రూ.3,000 కోట్లతో రహదారుల నిర్మాణం.కొత్తగా 23 పాలసీలు, పరిశ్రమలకు రాయితీలకు దేశంలో తొలిసారి ఎస్క్రో ఖాతాలు. సీఐఐ సమ్మిట్ 610 ఒప్పందాలు రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలు. 13 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.55 పెట్టుబడులు, 8.23 లక్షల ఉద్యోగాలు. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్. విశాఖ ఐటీ హబ్, గూగుల్ రిలయన్స్ డేటా సెంటర్, టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన. రాష్ట్రమంతటా ఒకే రోజు 13,326 గ్రామ సభల నిర్వహణ, దాదాపు 3 వేల పనులకు శ్రీకారం.రికార్డ్ స్థాయిలో ధాన్యం సేకరణ, 24గంటల్లో జమ. ఈ ఖరీఫ్ సీజన్లో 34.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ, 5.48 లక్షల మంది రైతులకు రూ.8,120 కోట్లు జమ. మార్కెట్ ఇంటర్వెన్షన్ - పొగాకు, మామిడి, కోకో, ఉల్లి సహా పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్, పారదర్శకంగా బదిలీలు.కొత్తగా మరో రెండు జిల్లాల ఏర్పాటుకు ప్రజామోదం, 26 నుంచి 28కి పెరగనున్న జిల్లాల సంఖ్య ఇలా 2025 లో ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు.

బాధిత రైతులకు పంట నష్ట పరిహారం పంపిణీ

రైతులకు పరిహారం అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వెలుగోడు

ఆత్మకూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు వెలుగోడు ఇన్‌ఛార్జీ ఫారెస్ట్ రేంజ ఆఫీసర్ ఎస్‌జడ్ఎ తాహెర్ ఆధ్వర్యంలో వెలుగోడు రేంజి వన్యప్రాణుల వల్ల పంట నష్టం జరిగిన రైతులకు మంగళవారం నష్ట పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. వెలుగోడు, నల్లకాల్వ గ్రామ రైతులకు వెలుగోడు మేజర్ గ్రామ సర్పంచి జైపాల్, గ్రామ పెద్దలు, అటవీ శాఖ అధికారులు మొత్తం 36 మంది రైతులకు రూ. 1.62లక్షల నష్ట పరిహారం పంపిణీ చేశారు. రేంజర్ మాట్లాడుతూ వన్య ప్రాణుల వలన ఎవరికైనా పంట నష్టం జరిగితే సంబందించిన సిబ్బందికి తెలియజేస్తే మీ పంటను వ్యవసాయ అధికారి, వీఆర్వోలతో తనిఖీ చేయించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఫారెస్ట్ సెక్షన్ ఆఫిసర్ గోపి, బీట్ ఆఫిసర్లు టి. వెంకటేశ్వర్లు, రజాక్, బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐక్యమత్యంతోనే సమస్యలకు పరిష్కారం

మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకుడు మస్తానయ్య

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్య మత్యంతో ఉండి పోరాడితేనే పరిష్కారం అవుతాయని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య అన్నారు. మంగళవారం నిర్వహించిన తాలూకా బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మరింత బలోపేతం కావాల్సిన వసరం ఉందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సభ్యత్వ నమోదు చేయాలని, ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు గమనించి వాటి తీర్చేందుకు సంఘం కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆత్మకూరు జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణ, పి ప్రసాద్ రావు, జుబేదాబేగం, రసూల్, పద్మావతి, పార్వతమ్మ, నాగ దస్తగిరి పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

శ్రీశైలంలో..

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలం క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించింది. వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్లకు విశేష పూజలు, రావణవాహనసేవ నిర్వహించారు. ఉదయం 3గంటలకు ఆలయ ద్వారాలను తెరచి మంగళవాయిద్యాల అనంతరం 3.30నిలకు స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. 4.30లకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహామంగళ హారతులు నిర్వహించారు. తర్వాత రావణవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తరద్వారమైన శివాజీగోపురం నుంచి వెలుపలకు తీసుకువచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కె. శివప్రసాద్‌స్వామి, స్థానాచార్యులు (అధ్యాపక) ఎం. పూర్ణానంద ఆరాధ్యులు, సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణ శర్మ, సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత స్పర్శదర్శనంపై చెంచు గిరిజనుల హర్షం

శ్రీశైలం క్షేత్రంలో నెలలో ఒకరోజు చెంచు గిరిజన భక్తులకు ముక్కోటి ఏకాదశి సందర్భంగా చెంచు, గిరిజనులకు మంగళవారం ఉచితంగా శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉదయం చెంచుగిరిజనులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, ఆలయ ఇఒ ఎం. శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు వారికి ఆహ్వానం పలికారు. తరువాత చెంచులు ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం వారికి ధర్మకర్తల మండలి అధ్యక్షులు, ఇఒ శ్రీస్వామివారి స్పర్శదర్శనం, అమ్మవారి దర్శనాలను చేయించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన వెంటనే స్థానిక మేకలబండ చెంచుగూడెములను సందర్శించానన్నారు. ఆ సందర్భంలో చెంచు భక్తులు తమకు స్వామివారి స్పర్శదర్శనం కల్పించాలని కోరారని తెలిపారు. ధర్మకర్తల మండలి సమావేశంలో చెంచుభక్తులకు నెలలో ఒకరోజున ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వారికి స్వామిఅమ్మవార్ల స్పర్శదర్శనం కల్పించినట్లు తెలిపారు.

స్వామి అమ్మవార్లకు నృత్య నీరాజనం

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా కాకినాడకు చెందిన వాగ్దేవి నృత్య నికేతన్ వారిచే ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం అలరించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధనలు నిర్వహించారు.

మహానంది : ప్రముఖ శైవ క్షేత్రం మహానంది పుణ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున స్వామివారిని అర్చకులు, వేద పండితులు విశేషంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి రామ పుల్లమ్మ దంపతుల సహకారంతో క్షేత్రాన్ని విశేషంగా అలంకరించారు. ఆలయంలో కొలువైన శ్రీ కోదండరాముల వారికి దాతలచే 500 కేజీల వివిధ రకాల పూజలతో సహస్ర పుష్పార్చన నిర్వహించారు.

శ్లోకా ఇంగ్లీష్ స్కూల్‌లో..

నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని శ్లోకా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వైకుంఠ ఏకాదశి విశిష్టత కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్లు కవిత, శ్రీదేవి పాల్గొని విజయవంతం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతను వివరించే ప్రసంగాలు, భక్తిగీతాలు, ప్రత్యేక కార్యక్రమాలతో వేడుకను మరింత అందంగా మలిచారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. అలాగే కోవెలకుంట్ల, మిడుతూరు, వెలుగోడు, కొలిమిగుండ్ల, సంజామలలోనూ వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించారు.

టిప్పర్లలో ఎర్రమట్టిని తరలిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా అర్ధరాత్రి ఎర్రమట్టి రవాణా

- అతివేగంతో ట్రాఫిక్‌కు అంతరాయం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - మహానంది
మహానంది మండల పరిధిలోని గాజులపల్లె-నంద్యాల జాతీయ రహదారిపై నాలుగు రోజులుగా అర్ధరాత్రి సమయాల్లో సుమారు పది టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని వేగంగా తరలించడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు, ప్రజలు తెలిపారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని అక్రమంగా తరలించే అక్రమార్కులకు బ్రేకులు వేసేవారే కనిపించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇష్టానుసారంగా ఎర్ర మట్టిని ఇటుక బట్టిలకు తరలిస్తూ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగిస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారు మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలున్నాయి. నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారిపై రాత్రి ఎక్కడ చూసినా మట్టి టిప్పర్‌లతో రహదారి రద్దీగా దర్శనమిస్తుంది. నిత్యం రోడ్డుపై మట్టి బెడ్డలు పడిపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు తెలిపారు. టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని సుమారు వంద ట్రిప్పుల వరకు రవాణా చేస్తున్నా ఏ అధికారికి కనిపించకపోవడం పలు అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తోంది. నిత్యం రద్దీ ప్రాంతం కావడంతో వాహనాలు అతివేగంగా మట్టిని తరలిస్తున్న సమయంలో ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ఎర్ర మట్టి రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆయిల్ మిల్లును ప్రారంభిస్తున్న డిఆర్‌డిఎ శ్రీధర్ రెడ్డి

లక్ష్మీ ఆయిల్ మిల్లు ప్రారంభం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల
కోయిలకుంట్ల పట్టణంలో రూ. 12లక్షలతో నిర్మించిన లక్ష్మీ ఆయిల్ మిల్లును డిఆర్‌డిఎ పీడీ శ్రీధర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పీఎం ఎఫ్ఎంఈ స్కీం కింద రూ.1.35లక్షల చొప్పున సబ్సిడీని హార్టికల్చర్ ద్వారా బ్యాంకులను సదుపాయంతో ఇచ్చామన్నారు. ప్రస్తుతం యూనియన్ బ్యాంకు కోయిలకుంట్ల రూ. 10లక్షలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మండలానికి పది యూనిట్ల చొప్పున ఉన్నాయని ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈస్కీం కింద పార్కింగ్ బ్రాండింగ్‌కు సంబంధించిన సాంకేతి పరిజ్ఞానం కృషి విజ్ఞాన కేంద్రం లక్ష్మీప్రియ సహాయ సహకారం అందిస్తారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ నాగ మల్లేష్ డిపిఎం ఎల్ హెచ్ బాబురావు సీసీలు డిఆర్పి మద్దిలేటి వెలుగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక మైత్రి వర్ధిల్లాలి

ఆత్మకూరు : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎపికెఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

ప్రజాశక్తి - ఆత్మకూరు
కార్మిక, కర్షక మైత్రి వర్ధిల్లాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ. రాజశేఖర్ నినదించారు. విశాఖ పట్టణంలో నేటి నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు 18వవ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ. రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, కృషి పళ్ల తోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్ బాషా, సిఐటియు జిల్లా నాయకులు ఎ. రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్ మాట్లాడారు. కార్మిక, కర్షక మైత్రి వర్ధిల్లాలని నినదించారు. కార్మిక, కర్షకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు టి వెంకటేశ్వరావు, జి నాగేశ్వరరావు, అంబయ్య, దాస్, పౌర సమాఖ్య నాయకులు ఏ సురేంద్ర, సిఐటియు నాయకులు బిఎస్ వలి, మహమ్మద్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, తేజ పాల్గొన్నారు.

బేతంచెర్ల : కార్మికుల హక్కులను, స్వేచ్ఛ స్వాతంత్రాన్ని కాలరాసే లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా బేతంచెర్ల పట్టణంలో సిఐటియు లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి రామాంజనేయులు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బేతంచర్ల పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ నుండి పట్టణ పురవీధుల గుండా ప్రతి కార్మిక సంఘాలలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని నినాదాలు ఇస్తూ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య సిఐటి జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ సంఘటిత అసంఘటిత కార్మిక రంగంలో ఉన్న ప్రతి కార్మికులు చైతన్యవంతంతో కుటుంబంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జై శ్రీనివాసులు, రామకృష్ణ, మద్దయ్య, టింగు, వెంకటరమణ, సుబ్బరాయుడు, నాగరాజు, ఎస్‌కె బాష, మధు, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వై. ఎల్లయ్య

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడతుఉన్న ఎపిఎం శ్రీనివాసులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్
ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు. నందికొట్కూరు మండలంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు, రైతు సాధికార సంస్థ, సెర్ప్, వెలుగు సంస్థల సమన్వయంతో మంగళవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వెలుగు ప్రాజెక్టు ఎపిఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ అంశాన్ని అజెండాగా తీసుకుని చర్చించాలని సూచించారు. చిన్న రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో పెరటి తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా తమకు ఉన్న పొలంలో కనీసం 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేయాలని వివరించారు. మండల సమాఖ్య స్థాయిలో ప్రకఋతి వ్యవసాయ కమిటీగా ముగ్గురు సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎఒ షేక్షావలి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా పంట మార్పిడి దిబ్బ ఎరువులు, పచ్చి రొట్టెలు భూమిలో సారవంతం చేసుకుని వివిధ రకాల పంటలు వేసి పురుగు, తెగులు అదుపులో ఉంచడంతోపాటు వేప గింజల కషాయం జీవామృతం, పుల్లటి మజ్జిగ సహజ సాగు విధానంలో అమలు చేయాలని తెలిపారు. డివిజన్ ఇన్‌ఛార్జీ అయ్యస్వామి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న వివిధ పంటల గురించి వివరించారు. పలు పంటల సాగులో మిల్లెట్ సాగు చేయాలన్నారు. కిచెన్ గార్డెన్ సాగు, ప్రకృతి వ్యవసాయతో రసాయన రహిత ఆహారం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ షేక్షావలి, సెర్ప్ ఎపిఎం శ్రీనివాసులు, సిసిలు దాసు, రమణ, కృష్ణమూర్తి, ఆర్ఎస్‌కె సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరేంద్ర, రవీంద్రనాథ్, పరమేశు , దాసు, కలీముల్లా, శాకద్రి పాల్గొన్నారు.

శిశువును చూపిస్తున్న డాక్టర్లు

పిహెచ్‌సిలో తొలి సిజేరియన్ కాన్పు

ప్రజాశక్తి - మిడుతూరు
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చెరుకు చెర్ల గ్రామానికి చెందిన గాయత్రి అనే గర్భిణికి డాక్టర్లు మొట్టమొదటి సారిగా సిజేరియన్ ఆపరేషన్ చేశారు. మహిళ సోమవారం పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిందని, ఆమెకు నార్మల్ కాన్పు కాకపోవడంతో మొట్ట మొదటి సారిగా సిజేరియన్ ఆపరేషన్ చేయడంతో ఆడపిల్లను జన్మించిందని డాక్టర్లు తిరుపతి, సుష్మ, శారద, అశ్విన్, మునిస్వామి మంగళవారం తెలిపారు. హాస్పిటల్‌లో ఎంతోమంది గర్భిణులకు నార్మల్ కాన్పులు చేశామని, ఇప్పుడే మొదటిసారిగా సిజరిన్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేశామన్నారు. సిజేరియన్ చేశాక తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సిజేరియన్ ఆపరేషన్ చేసిన వారిలో సిబ్బంది మూర్తుజవళి, సూర్యం, శ్యామల, రత్నమ్మ, ప్రశాంతి రామథులసి, సువేద, సత్యనారాయణ, జాబిన, శ్రీజ శేఖర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు నిషేధం

- సిఐ రమేష్ బాబు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల
నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ డిసెంబర్ 31న రాత్రి నిర్వహించే వేడుకలపై ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆంక్షలు పెడుతున్నట్లు కొలిమిగుండ్ల సిఐ రమేష్ బాబు అన్నారు. సిఐ మంగళవారం మాట్లాడుతూ నూతన సంవత్సరవేడుకలు అందరికీ, ఆమోదయోగ్యంగా, ఆహ్లాదకరంగా, ఆనందంగా, హానిరహితంగా ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, అల్లర్లకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి, అధిక శబ్దాలతో వాహనాలు హోరెత్తించిన, విన్యాసాలు చేసిన, బాణాసంచా కాల్చిన తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం షాపులు ప్రభుత్వం అనుమతించిన సమయం వారికి తెరిచి ఉంచాలని, మైనర్లు వాహనాలు నడపరాదని, వాహనాలను అధిక వేగంతో, ప్రమాదకర డ్రైవింగ్, ప్రజా ప్రదేశంలో రేసింగ్ చేసిన, వేడుకల పేరుతో మహిళల పట్ల, ఇతర వాహనదారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించరాదన్నారు. రోడ్ల పైన ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి కేకులు కట్ చేయరాదని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిజే బాక్సకు, స్పీకర్లకు ఎలాంట్ అనుమతి లేదని తెలిపారు.

నేడు పింఛన్లు పంపిణీ

- ఎంపిడిఒ దశరథరామయ్య

ప్రజాశక్తి - మిడుతూరు
మండలంలో బుధవారం పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ దశరథ రామయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముందుగానే అనగా 31 తారీఖున పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అందరూ పెన్షన్ లబ్ధిదారులకు ఉదయం 7 గంటల నుండి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులందరూ పింఛన్లు తీసుకోవాలని కోరారు. మండలంలోని టిడిపి నాయకులు గ్రామంలోని పింఛను లబ్ధిదారులకు విషయాన్ని తెలియజేయాలన్నారు. మిడుతూరు మండలంలో 5275 పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొత్తం రూ. 2,25,50,500 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గిత్త జయసూర్య నాగులూటి గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

యాగంటి శివదీక్ష పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

యాగంటి శివదీక్ష పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - బనగానపల్లె
మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో శివదీక్ష పోస్టర్లను పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలు మంగళవారం ఆవిష్కరించారు. జనవరి 8వ తేదీ శివదీక్ష మాల స్వీకరించి ఫిబ్రవరి 18న విరమించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యాగంటి దేవస్థానం ప్రధాన అర్చకులు మహేశ్వర శర్మ, పూజారులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కందుల వెంకట్రామిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల

భిజేంద్రారెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకొని వెంకట్రామిరెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, శివప్రసాద్, మనోహర్ రెడ్డి, ఇరానీ బాష తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ హక్ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల
డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డు అందుకున్న నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజద్ భాష సిద్ధిఖీను అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పిఎస్.షావలి ఖాన్, యూనివర్సిటీ ప్రిన్సిపల్ ఎస్.మహబూబ్ బాషా బృందం సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కర్నూలులోని అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు అంజాద్ బాష సిద్ధిఖీ యూనివర్సిటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను వారు ఘనంగా సన్మానించారు. కర్నూల్‌లోని ఉర్దూ యూనివర్సిటీని అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని ఆయన తెలిపారు.

అంజాద్ బాషా సిద్ధికిని సన్మానిస్తున్న దృశ్యం

ఎస్ఆర్‌బిసిలో దూకిన తల్లీకూతురు మృతదేహాలు లభ్యం

- అత్తింటి వారి వేధింపులే కారణం
- భర్త, అత్త, ఆడపడుచుపై కేసు నమోదు

ప్రజాశక్తి - గడివేముల
అత్తింటి వారి వేధింపులకు తట్టుకోలేక ఇద్దరు ఆడపిల్లలతో నంద్యాల జిల్లా గడివేముల మండలం ఉండుట్ల గ్రామానికి చెందిన ఎల్లలక్ష్మీదేవి శ్రీశైలం రైట్‌బ్యాంక్ కెనాల్ (ఎస్ఆర్‌బిసి)లో దూకింది. వారిలో రెండు మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. గడివేముల ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... ఉండుట్ల గ్రామానికి చెందిన ఎల్ల లక్ష్మీదేవి (23) ఇద్దరు కూతుర్లు వైష్ణవి (మూడు), నాలుగు నెలల పాప సంగీతతో ఈనెల 28న నక్కలవాగు బ్రిడ్జి వద్ద ఎస్ఆర్‌బిసిలో దూకింది. ఎస్ఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఎస్ఆర్‌బిసిలో దూకిన ఎల్లలక్ష్మీదేవి మృతదేహం , వైష్ణవి మృతదేహాలు లభ్యమయ్యాయి. నాలుగు నెలల సంగీత మృతదేహం లభ్యం కాలేదు. మతురాలి తండ్రి తలారి మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రమణయ్య, అత్త నాగులక్షమ్మ, ఆడపడుచు రామలక్ష్మమ్మ వేధించే వారు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. మగ పిల్లలు ఎందుకు పుట్టలేదని తరచూ వేధించే వారు. నువ్వు చనిపోతే నీ భర్తకు రెండో పెళ్లి చేస్తామని హింసించే వారు. వారి వేధింపులకు తట్టుకోలేక ఈనెల 28న నక్కలవాగు బ్రిడ్జి వద్ద ఎస్ఆర్‌బిసిలో పిల్లలతో సహా దూకింది. భర్త, అత్త, ఆడపడుచు పై కేసు నమోదు చేశారు. మతురాలి తండ్రి తలారి మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఆర్‌బిసిలో లభ్యమైన ఎల్ల లక్ష్మిదేవి మృతదేహం

మూడేళ్ల చిన్నారి వైష్ణవి మృతదేహం

సామాజిక తనిఖీ బహిరంగ సభ

- రూ.69,992 అవకతవకలు జరిగినట్లు గుర్తింపు

ప్రజాశక్తి - అవుకు
అవుకు మండలంలో 18వ విడత ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పిడి సూర్యనారాయణ, అంబుడ్స్ పర్సన్ మద్దిలేటి, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ పరమేశ్వరుడు, ఏపీడి నరేంద్ర కుమార్, ఎంపీడీవో రామకృష్ణ వేణి హాజరయ్యారు. 1016 పనులపై గ్రామ పంచాయతీ వారీగా నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అంశాలపై సభలో చర్చించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో 1016 పనులకు గాను రూ.10.25 కోట్లు ఖర్చు చేశారు. రూ.6.67 కోట్లు వేతనాలు చెల్లించగా 7 వేల మంది కూలీలు పనులు చేశారని తెలిపారు. వీటిపై తనిఖీలు చేయగా 69,922 రూపాయలు అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు చెప్పారు. మస్టర్లలో కొట్టివేతలు, పెనాల్టీలు, కొంటి విషయాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మన్యనాయక్ తండాలో రూ.15915, జూనూతలలో రూ.16,117, చనుగొండ్ల గ్రామపంచాయతీలో రూ.10,649లు రికవరీ ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీవోలు, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం : ఎడి

ప్రజాశక్తి - చాగలమర్రి
సహజ ఎరువులను వినియోగించడం, ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యానికి, పర్యావరణానికి, నేలకు, రైతుకు లాభదాయకని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్‌శేఖర్ పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బందికి మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మంజుల, రేవతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, జయరామిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీ

నిరుపేదలకు ఇళ్ల స్థలాలిచ్చే వరకూ పోరాటం : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : నంద్యాల పట్టణంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేంత వరకు పోరాటం ఆగదని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నంద్యాల పట్టణంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఇల్లులేని వారిని గుర్తించి వారితో సచివాలయాలు, తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల దగ్గర ధర్నాలు నిర్వహించి వారితో వ్యక్తిగత అర్జీలు ఇప్పించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం దాటుతున్నా ఇచ్చిన హామీలు ఏమాత్రం నెరవేర్చడం లేదన్నారు. ఎన్నికల ముందు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం ప్రతి ఒక్కరికి ఇచ్చి పక్కా ఇల్లు నిర్మిస్తామని చెప్పి ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిల బెట్టుకొని నంద్యాల పట్టణంలో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మురళీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు హరినాథ్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

రూపాయికే వెజిటెబుల్ పలావ్, కర్రి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

పేదల ఆకలి తీర్చేందుకు ఒక్క రూపాయికే వెజిటేబుల్ పలావ్, కర్రి అందిస్తూ విశాలక్షి పథకాన్ని నంద్యాల వాసి, ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ రాజేష్ ఆర్థిక సహకారంతో ప్రారంభించినట్లు నిర్వాహకులు నూర్ బాషా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సంఘమిత్ర బాలుర గృహం సమీపంలో ఏర్పాటు చేసిన వెజిటేబుల్ పలావ్, కర్రి కౌంటర్‌ను కూరగాయల మార్కెట్ ప్రసాద్, ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి ఉస్మాన్ బాషా, ఉపాధ్యక్షులు నూర్ బాషాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోళ్ళ రాజేష్ పేదల ఆకలి తీర్చేందుకు ఒక రూపాయికే వెజిటేబుల్ పలావ్, కర్రి, పప్పు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని, పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకాన్ని నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలకు అదనపు బస్సు సర్వీసు

ప్రజాశక్తి - బనగానపల్లె
పట్టణ శివారులోని రవ్వలకొండపై ఉన్న ఆదర్శ పాఠశాలకు అదనపు బస్ సర్వీసును మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇప్పటికే బనగానపల్లె నుండి రవ్వలకొండ ఆదర్శ పాఠశాలకు రెండు విద్యార్థి బస్సులు బనగానపల్లె డిపో నుండి నడుపుతున్నట్లు చెప్పారు. రెండు బస్సులు సరిపోవడం లేదని మరో బస్సును విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యను మంత్రి బీసీ.జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు మరొక బస్సును నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సు సౌకర్యాన్ని రవ్వలకొండ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ మహిళల జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పాణ్యం : 72వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నంద్యాల జిల్లా మహిళల జట్టుకు మంగళవారం పాణ్యం మండలంలోని విజయానికేతన్ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో 14 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 2 నుండి 5వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. క్రీడాకారిణులకు బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వసుంధర దేవి క్రీడా దుస్తులు అంద జేశారు. కార్యక్రమంలో విజయానికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీధర చౌదరి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా జట్టుతో ఎంఈఓ 2 సుబ్రహ్మణ్యం

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నంద్యాల

భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ మహిళా వైద్య విభాగం, నంద్యాల రోటరీ క్లబ్ ఇన్నర్ వీల్ మహిళా విభాగం సంయుక్త నిర్వహణలో మంగళవారం లైఫ్ మహిళా హెల్త్ క్లబ్ ప్రాంగణంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఎ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి అధ్యక్షతన రోటరీ ఇన్నర్ వీల్ మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లీశ్వరి నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో డాక్టర్ నాగమణి, డాక్టర్ సునీత మంచి ఆరోగ్యానికి జీవన శైలిలో మార్పుల గురించి వివరించారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య గర్భాశయ, అండాశయ క్యాన్సర్ పై, డాక్టర్ రాధిక గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, వ్యాక్సిన్ ఆవశ్యకత పై, డాక్టర్ గీతా వాణి రొమ్ము క్యాన్సర్,మామోగ్రామ్ అంశంపై సదస్సుకు హాజరైన మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు నాగమణి, నర్మద, వసుధ, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఐఎంఎ మహిళా విభాగం కార్యదర్శులు డాక్టర్ శైలజ, డాక్టర్ సునీత, కోశాధికారి డాక్టర్ హరిత, డాక్టర్ రాధిక, డాక్టర్ గీతావాణి, ఇన్నర్ వీల్ మహిళా విభాగం ప్రతినిధులు గోళ్ల పద్మ, శైలజ, సుశీల పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ గీతావాణి

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎఎస్‌పి అడ్మిన్ ఎన్ యుగంధర్ బాబు తెలిపారు.జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ సమావేశాన్ని ఎఎస్పీ అడ్మిన్ ఎన్ యుగంధర్ బాబు ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పోలీసు శాఖ సంబంధిత శాఖల అధికారులు పాల్గొని, డ్రగ్స్ నిర్మూలనపై సమన్వయ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో, హాస్టల్ లలో ఈగాల్ క్లబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తన వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ వద్దు - బ్రో నినాదంతో ప్రజలందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. డ్రగ్స్ సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు గాని లేదా టోల్ ఫ్రీ నంబర్ 1972 తెలియజేయాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి : ఎస్ఐ

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని ఆయా గ్రామాలలో 2026 నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై జయప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ 2026 ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31, జనవరి 1వ తేదీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కొంతమంది అత్యుత్సాహం, అజాగ్రత్త వల్ల కొన్ని కుటుంబాలలో తీవ్ర విషాదం చోటుచేసుకుందన్నారు. ఎవరైనా రోడ్లపై కేక్ కట్ చేయడం, బాణసంచా కాల్చడం, అధిక శబ్దంతో లౌడ్ స్పీకర్లు పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రూ.10 వేలు జరిమానా, వాహనాల సీజ్, 6 నెలల వరకు జైలు శిక్ష విధించనున్నట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి హోటళ్ళు, వైన్ షాపులు, బార్లు మూసివేయాలన్నారు. 31 రాత్రి ప్రధాన రోడ్లపై ఆంక్షలు లేదా మళ్లింపులు ఉండవచ్చన్నారు. అవసరమైతే అత్యవసర సేవల కోసం 112కు డయల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై జయప్ప

పట్టుదలతో చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టుదలతో చదివితే విజయం సొంతమవు తుందని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండ్ల నాగిరెడ్డి సహకారంతో యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకు 100 సూత్రాలు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల్లో విజయం ఎలా సాధించాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి ర్యాంకులు సాధించ వచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గౌరీ శంకర్, ఉపాధ్యాయులు కెసి.శ్రీనివాసులు, ఎస్ఎండి.రఫీ, పరమేశ్వరుడు పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న బ్రహ్మానంద ఆచారి

రామకృష్ణ కళాశాలలో 'స్ప్రింగ్ ఫెస్ట్-2కె25'

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీబీఎ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'స్ప్రింగ్ ఫెస్ట్-2కె25' జాతీయ స్థాయి డిగ్రీ విద్యార్థుల సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీ పట్టాలు మాత్రమే సరిపోవని, విద్యార్థులు అకడమిక్ చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. ఇంటర్వ్యూలలో విజయం సాధించాలంటే సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు తప్పని సరన్నారు. ప్రభుత్వ పరంగా కూడా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా అనేక అవకాశాలను కల్పిస్తున్నా మని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి, కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కెబివి.సుబ్బయ్య, కన్వీనర్లు పాల్గొన్నారు.

కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

కలెక్టర్, జెసిలను కలిసిన మాస్టర్ ట్రైనర్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కలెక్టర్ చాంబర్‌లో యువ ఆపద మిత్ర పథకం కింద ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని వసడమాలో 21 రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసి మాస్టర్ ట్రైనర్లుగా తయారైన జిల్లా వాలంటీర్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కలెక్టర్, జేసీలను కలిసిన మాస్టర్ ట్రైనర్లు

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిల క్షేత్రం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తజనసంద్రమైంది. తెల్లవారుజామున ధనుర్మాస పూజ అనంతరం నాలుగు గంటలకు వైకుంఠ ఉత్తర ద్వారాలు తెరిచి భక్తులకు దర్శనం కల్పించారు. అహోబిల లక్ష్మీ నరసింహ స్వామిని మాజీ ఎమ్మెల్యే గంగుల నాని సతి సమేతంగా దర్శించుకున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు గరుడోత్సవము కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అలాగే కారంజ నరసింహ స్వామి ఆలయం స్వయానా ఉత్తరద్వారాలు ఉండడంతో భక్తులు భారీగా వచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూరల్ సీఐ రమణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అహోబిలంలో ప్రజ్ఞ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్సిసి విద్యార్థులు పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వివిఎల్ఎన్ రామానుజన్ , మనియార్ సౌమ్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **అలాగే** మున్సిపాలిటీ పరిధిలోని పాలసాగరం గ్రామంలో వకుళ నది ఒడ్డున వెలసిన తిమ్మప్ప స్వామి దేవాలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర దర్శనం వేంకటేశ్వర స్వామిని ప్రజలు దర్శించుకున్నారు. అనంతరం వెంకటేశ్వర స్వామి కళ్యాణంను పాలసాగరం గ్రామ పెద్దలు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, సుజాత రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు వేదమంత్రాల మధ్య కనుల పండుగగా జరిపించారు.

బందోబస్తులో అనంత డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థుల సేవలు

రుద్రవరం మండలంలోని వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆళ్లగడ్డలోని అనంత డిగ్రీ కళాశాల నుండి ఎన్‌సిసి విద్యార్థులు కళాశాల తరపున విధుల్లో పాల్గొన్నారు. అనంత విద్యా సంస్థల అధినేత రామ సుబ్బారెడ్డి ఎన్‌సిసి విద్యార్థుల సేవాభావాన్ని కొనియాడుతూ, సమాజ సేవలో ఇలాంటి కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అభినందనలు తెలిపారు.

అవుకు : అవుకు పట్టణంలోని భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వైసిపి రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కొండపై ఉన్న మద్దిలేటి స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. **పాణ్యం**లోని వెంకటేశ్వర స్వామి, వీరనారాయణ స్వామి, శ్రీకృష్ణ దేవాలయంలో భక్తులు ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ వీరనారాయణ స్వామి దేవాలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు కృష్ణశాస్త్రి, శుభశాస్త్రి, భాస్కరాచారి, శంకరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన సిబ్బంది తిరుమలయ్య, మద్దిలేటిలు అన్ని ఏర్పాట్లు చేశారు. **రుద్రవరం** సమీపంలోని వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం, ఉత్తర ద్వార పూజ నిర్వహించిన అనంతరం స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా జరిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ దస్తగిరి బాబు , ఎస్ఐ జయప్పల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. **చాగలమర్రి** మండలంలోని ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసాయి. మద్దూరు గ్రామంలో ఉత్తర ద్వారం ఉత్తర ముఖం గల ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల భిజేంద్రారెడ్డి, సారికారెడ్డి దంపతులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ జయచంద్రారెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది, జిఎంఎస్‌కెలతో బందోబస్తును పర్యవేక్షించారు. **శిరివెళ్ల :** మండలంలోని కోటపాడు గ్రామంలో గల చెన్నకేశవ వీరభద్ర స్వాముల వారి గ్రూప్ దేవాలయాలలో నీటి సంఘం వైస్ చైర్మన్ బూసిరెడ్డి వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

రుద్రవరంలో..

స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గంగుల

అవుకులో...


చాగలమర్రి : మద్దూరులో పూజలు చేస్తున్న భక్తులు


శిరివెళ్ల మండలం కోటపాడులో..